

10 పోలింగ్ కేంద్రాల మార్పునకు ప్రతిపాదన

● రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (హరనాథపురం) : ఓటర్ల సౌకర్యార్థం జిల్లాలో 10 పోలింగ్ కేంద్రాలను మార్పు చేసేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. శిథిల భవనాల్లో ఉన్న ఆత్మకూరు నియోజకవర్గంలో రెండు కేంద్రాలు, కోవూరులో ఒక కేంద్రం, నెల్లూరు రూరల్‌లో రెండు, సర్వేపల్లి లో మూడు, ఉదయగిరిలో రెండు కేంద్రాలను గుర్తించి అన్ని వసతులు ఉన్న సమీప ప్రభుత్వ భవనాల్లోకి మార్పు చేసేందుకు ప్రతిపాదించినట్లు చెప్పారు. తుది ఓటర్ల జాబితాకు సంబంధించి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటున్నామని వివరించారు. ఈ సమావేశంలో డీఆర్వోలవన్న, వైసీపీ నుంచి వై.మురళీరెడ్డి, సురేంద్రబాబు, టీడీపీ నుంచి ఎస్కే. రసూల్, జలదంకి సుధాకర్, శివకుమార్, బీజేపీ నుంచి బి.శ్రీనివాసులు, కాంగ్రెస్ నుంచి ఎ. బాలసుధాకర్, బీఎస్పీ నుంచి శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

అలక వీడండి.. అబ్బే.. వద్దులేండి!

నెల్లూరు పార్లమెంట్ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ససేమిరా అంటున్నారు. ఆయన్ను బుజ్జగించేందుకు అధిష్ఠానం చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. మరోవైపు ఈ అవకాశాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవడానికి విపక్షాలు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో వేమిరెడ్డి రోజుల వ్యవధిలో ఏదో ఒక కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఆయన వెంట నడవడానికి జిల్లాలోని పలువురు వైసీపీ నాయకులు సిద్ధమవుతున్నారనే ప్రచారం జోరందుకుంది.



పోటీకి వేమిరెడ్డి ససేమిరా!? ● ఫలించని వైసీపీ పెద్దల బుజ్జగింపులు
జరిగిన కుట్రపై రగిలిపోతున్న వీపీఆర్ ● భవిష్యత్తుపై త్వరలో నిర్ణయం

నెల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర అభ్యర్థి ఖరారు వెనుక అసలు కుట్రను గమనించిన వీపీఆర్ తీవ్ర మనస్తాపానికి గురై ఎన్నికల ప్రచారాన్ని ఆపేసిన విషయం తెలిసిందే. ఎన్నికల విధుల నుంచి తప్పుకోవాలని తన కార్యాలయ సిబ్బందిని సైతం ఆదేశించారు. దీంతో కొన్ని నెలలుగా సందడిగా ఉన్న వీపీఆర్ నివాసం ప్రస్తుతం బోసిపోయింది. వైసీపీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం పట్ల కలత చెందిన వీపీఆర్ కుటుంబ సమేతంగా ఢిల్లీకి వెళ్లిపోయారు. అధిష్ఠానం ఆయన్ను బుజ్జగించే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. జరిగిందేదో జరిగిపోయింది. అలకవీడి ఎన్నికలకు సిద్ధం కమ్మని వీపీఆర్‌ను కోరినట్లు చెబుతున్నారు. ఇందుకు ఆయన ఏమాత్రం అంగీకరించలేదని విశ్వసనీయ సమాచారం.

సన్నిహితుడైనా ససేమిరా!

వైసీపీ అధినేత జగన్‌కు అత్యంత సన్నిహితుడు వీపీఆర్ అయినా అధిష్ఠానం బుజ్జగింపులను ఆయన లెక్కచేయకపోవడానికి బలమైన కారణాలు చెబుతున్నారు. ఎన్నికల బరిలోని ప్రధాన రాజకీయ పార్టీల బలాబలాల పరంగా చూస్తే నెల్లూరు పార్లమెంట్ పరిధిలో అభ్యర్థులు ఎవరైనా హోరాహోరీ తప్పదని పరిశీలకులు భావిస్తున్నారు. టీడీపీకి నెల్లూరు నగర నియోజకవర్గం నెల్లూరు పార్లమెంట్ ఫలితాలను శాసించే అవకాశాలు ఎక్కువ అనే భావన ఉంది. ఇవి సిటీ వైసీపీ అభ్యర్థిగా అనిల్ పోటీ చేస్తాడని అంచనాలు ఉన్నప్పటి మాట. ఇప్పుడు అనిల్ తన స్థానంలో తన అనుచరునికి టికెట్టు ఇప్పించడంతో ఈ లెక్క మారిపోయిందని వీపీఆర్ వర్గీయులు అంటు న్నారు. వీపీఆర్‌ను ఓడించాలనే కుట్రతోనే సిటీ అభ్యర్థిని ఎంపిక చేశారని వాదిస్తున్నారు. సిటీ అభ్యర్థిని మార్చాలని గట్టిగా కూడా కోరడానికి వీలులేని విధంగా వ్యూహాత్మకంగా కుట్ర పన్నారని అంటున్నారు. సిటీ అభ్యర్థిని మార్చమని కోరితే పార్లమెంట్ పరిధిలోని ముస్లిం ఓటర్లకు వీపీఆర్ వ్యతిరేకం అవుతారని, ఆవిధంగా ఒక బలమైన వర్గానికి తమ నాయకుడ్ని వ్యతిరేకం చేయాలనే కుట్రలో భాగంగా ఇలా చేశారని అంటున్నారు.



నిర్మానుష్యంగా ఉన్న వీపీఆర్ ఇల్లు

త్వరలో కీలక నిర్ణయం


తనను ఓడించాలనే ఉద్దేశంతోనే ఇదంతా జరిగిందని వీపీఆర్ సైతం గట్టిగా విశ్వసిస్తున్నట్లు సమాచారం. అందుకే నీతిలేని చోట నిలబడలేక ఎన్నికలకు దూరం కావాలని నిర్ణయించుకున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. పార్లమెంట్‌కు పోటీ చేయమని వైసీపీ అగ్రనాయకులు ఎంత ఒత్తిడి చేస్తున్నా, తెలిసి తెలిసి కుట్రకు బలికావడం ఇష్టం లేక వీపీఆర్ పోటీకీ ససేమిరా అంటున్నట్లు తెలిసింది. తన రాజకీయ పయనంపై త్వరలో వీపీఆర్ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

పెరుగుతున్న మద్దతు

సౌమ్యుడు, వివాద రహితుడిగా గుర్తింపు పొందిన వేమిరెడ్డికి వ్యతిరేకంగా రాజకీయ కుట్ర జరగడం పట్ల ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు తీవ్రంగా స్పందిస్తున్నారు. రాజకీయంగా ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా ఆయన వెంటే నడవడానికి సిద్ధం అవుతు న్నారు. సేవా కార్యక్రమాలతోపాటు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా వీపీఆర్ తక్కువ కాలంలోనే జిల్లా పార్టీపై పట్టు సాధించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రతి నియోజకవర్గంలోనూ వ్యక్తిగతంగా ఈయన్ను అభిమానించే నాయకులు, అభిమానులు ఉన్నారు. వీపీఆర్ తీసుకోబోయే నిర్ణయం జిల్లా వైసీపీలో కుదుపు తీసుకొస్తుందో లేదా కొవ్వొత్తిలా కరిగిపోవడానికి సిద్ధపడి మెత్తపడుతుందో వేచిచూడాలి.

సోమశిల వెల వెల!

అనంతసాగరం : సోమశిల జలాశయంలో నీటిమట్టం తగ్గి వెలవెలబోతోంది. కొంతకాలంగా ఎగువ నుంచి వరద ప్రవాహం పూర్తిగా ఆగిపోవడంతో డ్యాంలో ఉన్న నీటినే మొదటిపంట అవసరాలకు నీరు వినియోగించుకోవాల్సిన అవశ్యకత నెలకొంది. గతేడాది డిసెంబరు నుంచి రబీకి డెల్టాతోపాటు నాన్‌డెల్టాకు నీరు ఇస్తుండగా రోజువారీగా ఉన్న జలాల్లో 3,180 క్యూసెక్కులు ఖర్చు అవుతోంది. అయితే, రానున్న రోజుల్లో ఎండతీవ్రత పెరిగే అవకాశం ఉండగా ప్రాజెక్టులోని నీరు ఆవిరి రూపంలో మరికొంత వృథా అయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఉన్న నీటిని ఎంతో జాగ్రత్తగా వాడుకోవాల్సి ఉండగా మొదటి పంట చేతికందాలంటే ఏప్రిల్ 15 వరకు నీరు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం సోమశిల ప్రాజెక్టులో 24.324 టీఎంసీలు ఉండగా ఇందులో తాగు, డెడ్‌స్టోరేజీ 7టీఎంసీలు మినహాంచాల్సి ఉంది. ఇక మిగిలిన 17 టీఎంసీల నీటిని వరి చేతికందే వరకు సర్దుకోవాల్సిన పరిస్థితి. నీటి వినియోగంపై జిల్లా యంత్రాగం ప్రత్యేక పర్యవేక్షణ చేయాలి. ఎక్కడా నీటి వృథా జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలి. సహజంగా ఆగస్టు మాసంలో శ్రీశైలం నుంచి కృష్ణాజలాలు సోమశిలకు రావాల్సి ఉంది. గతేడాది చుక్క నీరు కూడా రాలేదు. దీంతో కండలేరుకు నీరు ఇవ్వలేని పరిస్థితి కలిగింది. ఈసారి కూడా కృష్ణమ్మ కరుణించే సూచనలు కనిపించడం లేదు. ఇప్పటికే జిల్లాలోని ప్రధాన నీటి వనరుల్లో నీట్టిమట్టం తగ్గి బోర్లకు నీరందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఈ ఇబ్బందులు జటిలంగా మారే ప్రమాదం ఉంది.



హైలెవల్ కెనాల్ ఆశలు ఆవిరి

ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు తాగు, సాగు నీరు ఇచ్చేలా రూపొందించినసోమశిల హైలెవల్ కెనాల్ పనులు నిధులు లేమితో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. 2013లో ఈ పనులకు అంకురార్పణ జరగ్గా ఇంత వరకు సమగ్రరూపం దాల్చలేదు. ఇంకా మొదటి దశ పనులు పూర్తికాలేదు. ఏళ్ల గడుస్తున్న ఈ పను లకు సంబంధించి భూసేకరణ, పరిహారం చెల్లింపులు పూర్తికాక కాలేదు.

ఖర్చులు పెరిగినా రైతన్నలో ఆశ చావలేదు. వ్యవసాయమే జీవనాధారమైన కర్షకులు చెరువులు, కుంటల్లో ఉన్న నీటికితోడు చివరి తడులకు నీరివ్వకపోతారా!? అన్న నమ్మకంతో పంటలు సాగుచేశారు. అప్పుడు పరిస్థితి పూర్తి విరుద్ధంగా మారింది. జలవనరులన్నీ ఇంకిపోగా, పాతాళంలోకి పడిపోయిన భూగర్భజలం బోర్లకు అందనంటోంది. ప్రధాన సోమశిల జలాశయంలో నానాటికి నీటిమట్టం పడిపోతోంది. కావలి ప్రాంతంలో నీరందక నెర్రెలిచ్చిన వరి చేనును చూసి రైతన్నలు కుమిలిపోతున్నారు. నీరిచ్చి ఆదుకోండి మహాప్రభో అంటూ వేడుకుంటున్నారు. ఇక కందుకూరులో నీటికోసం భగీరథయత్నం చేస్తున్నారు. ఖర్చులకూ వెనుకాడని రైతులు సుదూర ప్రాంతాల నుంచి పైపుల ద్వారా నీటిని తెచ్చి పొగాకు మొక్కలకు ఊపిరి పోస్తున్నారు.

అందని నీరు.. ఎదగని పైరు!

● మెట్టప్రాంతంలో కర్షకుల కన్నీటి వెతలు ● ఇంకిపోతున్న నీటివనరులు
● బీడువారుతున్న వరి పొలాలు ● చివరి తడి తగ్గుతుందనే భయంతో రైతులు

సోమశిల నీరిచ్చి కాపాడమని వేడుకోలు



జలదంకి : లేదూట గంగమ్మ చెరువులో అడుగంటిన నీరు



బోగోలు మండలం తెల్లగుంటలో నెర్రెలిచ్చిన వరి చేను

కావలి : పాలకులు, అధికారులు, రైతుల మధ్య అవగాహన లేమితో కావలి డివిజన్‌లోని అనేక ప్రాంతాల్లో సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. నీరందక పచ్చని పైరు ఎండిపోతోంది. సోమశిల నుంచి నీటి విడుదలపై స్పష్టత లేక.. అధికారులు, పాలకుల మాటలకు పొంతనలేక వరిసాగుదారులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు చెరువుల్లోని నీటి నిల్వలు ఎంతవరకు వస్తాయో అంచనా వేయలేని అధికారులు రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు.

● కావలి మండలంలో చలంచర్ల, సిరిపురం, నారాయణపురం, పేపర్లవారిపాలెం చెరువుల్లో నీరు తక్కువగా ఉండటంతో వాటి కింద వరిసాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమశిల నీరు రాక పోతాయా అనే నమ్మకంతో వారున్నారు. తుమ్మలపెంట చెరువులో ప్రస్తుతానికి నీరు ఉన్నా చివరితడికి తగ్గుతుందనే భయం రైతులను వెంటాడుతోంది. చౌదరిపాలెం రైతుల పరిస్థితి కూడా అంతే. ఇక బోగోలు మండలంలో ఎస్‌వీపాలెం వరకు సోమశిల నీరిస్తామని ఐఏబీ సమావేశంలో తొలుత చెప్పారు. అయితే కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు సాగునీరిచ్చే ఏర్పాట్లు చేస్తామని చెప్పడంతో రైతులు సాగు చేపట్టారు. కానీ, ఇప్పటివరకు నీరు రాకపోవడంతో పొలాలు బీటలు వారుతున్నాయి. జలదంకి మండలంలో కావలి కాలువకు తొలుత ఎస్‌వీపాలెం వరకు నీరు వదులుతామని చెప్పినా తర్వాత సీబీఎస్ వరకు ఇస్తామని చెప్పారు. అయితే ఆయుకట్టుకన్నా అనధికార ఆయుకట్టుకు మోటార్ల ద్వారా నీరు తోడేస్తుండటంతో దిగువ ప్రాంతానికి సరిపడా నీరు రావటంలేదని రైతులు వాపోతున్నారు. జలదంకి పెద్ద చెరువు, లేదూట గంగమ్మ చెరువుల కింద, బ్రాహ్మణక్రాక మేజరు కింద సాగుచేసిన వరిపైరుకు నీటి ఎద్దడి మొదలైంది. లేదూట గంగమ్మ చెరువులో నీరు అడుగంటి పోవటంతో గుంటల్లోని నీటిని ఆయిల్ ఇంజన్లు పెట్టి తోడుకుంటున్నారు. పైరు పొట్టదశలో ఉండటంతో ఇప్పుడు నీరు తగ్గితే దిగుబడి తగ్గే ప్రమాదం ఉన్నందున రైతులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. కలిగిరి, కొండాపురం మండలాల్లోనూ వరికి నీటి కష్టాలు తప్పేలా లేవు.

నీరివ్వకపోతే నష్టపోతాం

సాగునీరు అందించకపోతే సన్న చిన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతారు. కావలి ఎమ్మెల్యే, అధికారులు నీరిస్తామంటేనే రైతులు సాగు చేశారు. నాకున్న రెండెకరాలలో వరి సాగు చేపట్టగా నీరు చాలక ఎండి పోయే ప్రమాదం ఉంది. సోమశిల డ్యాం నీరు ఇచ్చి ఆదుకోవాలి.



- దాసరి బాబూరావు, కడనూతల చెరువు ఉపాధ్యక్షుడు

రైతులకు కోలుకోని నష్టం

సాగుచేసిన వరి పైరుకు చివరి తడి తగ్గే ప్రమాదం ఉన్నందున సోమశిల నీరిచ్చి ఆదుకోవాలి. బ్రాహ్మణక్రాక మేజరు కింద 5 ఎకరాలు సాగు చేశాను. నీరు లేకపోవడతో చీకటివాగు ఊట నీటితో అష్టకష్టాలు పడి పంటలను తడుపుకుంటున్నా. సోమశిల నీరిచ్చి రైతులను ఆదుకోకపోతే తీవ్రంగా నష్టపోతాం.



- స్వర్ణ కొండపనాయుడు, బీక్రాక అగ్రహారం

నీటి పర్యవేక్షణ కరువు

చెరువులలో ఉన్న అరకొర నీటికి కూడా పర్యవేక్షణ లేదు. గతంలో నీటిసంఘాలు ఉండగా నీటిని అవసరం మేరకే వదిలేవారు. ఇప్పుడు ఉన్న నీటిని ఇష్టాను సారంగా వదులుతున్నారు. కూలీల కొరతతో నాట్లు ఆలస్యమయ్యాయి. ఇప్పటివరకు రూ.20 వేలకుపైగా ఖర్చు అయ్యింది. చెరువులో నీరు అయిపోతున్నందున సోమశిల నీరిచ్చి ఆదుకోవాలి.

- షేక్ ఖాదర్ బాషా, సిరిపురం

కందుకూరులో నీటికోసం వెంపర్లాట

కందుకూరు : పంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథయత్నం చేస్తున్నారు. బెట్టవారుతున్న పైరును కాపాడుకునేందుకు రైతులు రేయింబవళ్లు పొలాల్లో జాగారం చేస్తూ సుదూర ప్రాంతాల నుంచి నీటిని తరలించి నీటితడులు ఇచ్చేందుకు నానాతంటాలు పడుతున్నారు. కందుకూరు ప్రాంతంలో ప్రధాన నీటి వనరు రాళ్లపాడు రిజర్వాయరు సహా చెరువుల కింద ఎక్కడా ఈ ఏడాది వరినాట్లు వేయలేదు. దీనికి ప్రత్యామ్నాయంగా మెట్టపైర్లు, ఆరుతడిగా పత్తి, మిరప, కూరగాయల సాగుచేశారు. అయితే ప్రస్తుతం నీటితడులు ఇచ్చేందుకు కూడా చెరువులు, కుంటల్లో నీరు ఇంకిపోయాయి. ముఖ్యంగా పొగాకు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వర్షాధారంగా సాగుచేసిన పొగతోటలు బెట్టకు వచ్చి గిడస బారుతుండటంతో మొక్కల పెరుగుదల కోసం రూ.లక్షలు ఖర్చు చేస్తుండటమేగాక రేయింబవళ్లు తోటల్లోనే జాగారం చేస్తున్నారు. ఓ వైపు దట్టంగా కురుస్తున్న మంచు మరోవైపు చిమ్మచీకట్లో విష పురుగుల భయాన్ని కూడా పక్కనపెట్టి పొగతోటలకు తడి అందించేందుకు తంటాలు పడుతున్నారు. కందుకూరు ప్రాంతంలో ప్రస్తుతం ఏ గ్రామం వెళ్లి చూసినా ఇవే పరిస్థితులు సాక్షాత్కరిస్తున్నాయి. ఎలాగైనా పొగతోటలకు నీరుకట్టి దిగుబడులు తగ్గకుండా చూడాలని భగీరథయత్నం చేస్తున్నారు. కిలోమీటర్ల దూరం ఒకేదఫా ఇంజన్ల ద్వారా నీటి తరలింపు సాధ్యం కాదు కనుక మధ్యమధ్యలో చిన్నచిన్న గుంతలు తీసి ఆ గుంతలకు వేసి అక్కడినుంచి మరో ఇంజనుతో చేను వరకు నీటిని తరలించి తడులు ఇస్తున్నారు. దీంతో ఒక్క ఎకరానికి రూ.20వేలకుపైనే ఖర్చవుతోంది.



కందుకూరు ప్రాంతంలో నీరు లేక ఎండిపోతున్న టమోటా తోట

'రాళ్లపాడు'లో ఏడాదీ వరి లేదాయె!

25 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న రాళ్లపాడు రిజర్వాయరు కింద వరుసగా మూడవ ఏడాదీ వరిసాగు లేకుండా పోయింది. రిజర్వాయరు పూర్తిసామర్థ్యం నీరు చేరకపోవటంతో వరిపై ఆశలు వదులుకున్నారు. కొందరు రైతులు భూములను బీళ్లుగా వదిలేయగా బోర్లు అందుబాటులో ఉన్న రైతులు పత్తి సాగుచేశారు. ఇక వర్షాధారంగా కూరగాయల సాగు చేసిన రైతులు కాపుకొచ్చిన కూరగాయల తోటలు నిలువునా ఎండిపోతు న్నా చేయగలిగింది లేక కన్నీరు కారుస్తున్నారు.



కందుకూరు ప్రాంతంలో పైపుల ద్వారా పొగతోటకు నీరు కడుతున్న రైతు

తుఫాను సాయమేది జగనన్నా!?

● 4,247 మంది రైతుల ఎదురుచూపు

నెల్లూరు (వ్యవసాయం), ఫిబ్రవరి 5 : రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ పెద్దలు వారికి సాంత్వన చేకూర్చడంలో విఫలమవుతున్నారు. తుఫాను దాటికి నష్టపోయిన కర్షకులకు నష్టపరిహారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. దాదాపు రెండు నెలలు గడుస్తున్నా 'మిచౌంగ్' గాయం రైతులను వెంటాడుతూనే ఉంది. జిల్లాలో దాదాపు 4,237 మంది రైతులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నా రు. మిచౌంగ్ తుఫాను ప్రభావంతో ఉద్యాన పంటల తోపాటు వరి, పొగాకు, మినుము, గోధుమ పంటలు కూడా దెబ్బతిన్నాయి. సాగునీటి విడుదల ఆలస్యం కావడంతో రబీ సీజన్ పంటలు ఆరంభ దశలోనే ధ్వంసమయ్యాయి. ఎప్పటి కప్పుడు నష్టపోయిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో అధికా రులు సేకరించి గతేడాది డిసెంబరులో ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు. అయినా కేవలం 80శాతం ఇన్‌పుట్ సబ్సిడీతో విత్త నాల వరకు రైతులకు అందజేశారు. చేతికందే పంటలు తుఫాను దాటికి నష్టపోయినా ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ అందలేదు.

● ఒక్క పైసా ఇవ్వలేదు

ఉద్యాన పంటలకు సంబంధించి అరటి, నిమ్మ, బొప్పాయి తదితర పంటలు దాదాపుగా 2,330 ఎకరాల్లో దెబ్బతినగా రూ. 2.32 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఉద్యాన శాఖ అధికారులు లెక్క తేల్చారు. ఈ పరిహారం కోసం 3,822 మంది రైతులు ఎదురు చూస్తూనే ఉన్నారు. అదేవిధంగా వరి, మినుము, గోధుమ, పొగాకు పంటలు దెబ్బతినడంతోపాటు మట్టి కోతలు, ఇసుక మేటలు ఏర్పడినవి దాదాపు 564.9 ఎకరాలుగా వ్యవసాయశాఖ అధికారులు నిర్ధారించారు. 425 మంది రైతులు దాదాపు రూ. 33.7 లక్షల కోసం ఎదుచూస్తూనే ఉన్నారు. సంక్రాంతి పండుగ కన్నా పరిహారం అందుతుందని రైతులు భావించినా అది జరగలేదు. కనీసం కూలి ఖర్చులకైనా పరిహారం వస్తుందన్న ఆశతో రైతన్న ఎదురుచూస్తూనే ఉన్నాడు.

పోర్టు పనుల అడ్డగింత

● ఇళ్ల స్థలాల కోసం కర్లపాలెం గ్రామస్థుల ఆందోళన

గుడ్లూరు, ఫిబ్రవరి 5 : రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులను కర్లపాలెం గ్రామ మత్స్యకార కుటుంబాలు సోమవారం అడ్డుకున్నాయి. పోర్టు నిర్మాణంలో భాగంగా తమకు ఇళ్ల స్థలాలు, ఇతర ఆస్తులకు నష్టపరిహారం ఇస్తామన్న అధికారులు నేటికీ ఇవ్వలేదని అన్నారు. దీంతో ఆందోళనకు దిగినట్లు కర్లపాలెం వాసులు చాపల రమణయ్య, పిన్నే వెంకట శేషయ్య, చాపల మీరయ్య, లంకే సుబ్బారావు, చాపల శ్రీను, వల్లభన ఏడుకొండలు, కె. శ్రీనివాసులు, ఏలా శ్రీను, అప్పది తిరపతితోపాటు మరికొందరు మత్స్యకారులు తెలిపారు. త్వరలో అందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని పోర్టు ప్రతినిధులు తెలిపినా వారు వినలేదు. తమకు ఇళ్ల స్థలాలు పూర్తిస్థాయిలో కేటాయించే వరకు ఆందోళన కొనసాగిస్తామని మత్స్యకారులు తేల్చి చెప్పారు. జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి తమ న్యాయమైన కోరికలను నెరవేర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.





ఇంత నిర్లక్ష్యమా!?

- నిరుపయోగంగా నిరోధ్, ఓఆర్ఎస్, టెస్ట్ ట్యూబ్‌లు
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని ఓ పాడుబడిన భవనంలో శిథిలమవుతూ, నిరుపయోగంగా ఉన్న విలువైన నిరోధ్, ఓఆర్ఎస్, టెస్ట్ ట్యూబ్‌ల నిల్వలు వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోన్నాయి. జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలలు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు సరఫరా చేసి గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అందజేసేందుకు జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం వీటిని డీఎం హెచ్‌వో కార్యాలయానికి సరఫరా చేస్తోంది. వందల సంఖ్యలో పెద్దపెద్ద బాక్సులలో వచ్చే వీటిని జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా చేయాలి. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎంతో విలువైన ఆరోగ్య కరమైన వస్తువులు ఓఆర్ఎస్, నిరోధ్ ప్యాకెట్ల బాక్సులను కార్యాలయ ప్రాంగణంలోని పాడుబడిన భవనంలో వదిలేశారు. దీంతో పాటు అనేక ప్రయోగాలకు చెందిన టెస్ట్‌ట్యూబ్‌లు కూడా అట్ట పెట్టెలలో వదిలి వేశారు. వీటి విలువ లక్షల్లో ఉన్నా నిర్లక్ష్యంగా వదిలి వేయడంపై సర్వాత్ర విమర్శలు వ్యక్తమవుతోన్నాయి.

- నెల్లూరు(వైద్యం).

అట్టపెట్టెలు పగిలిపోయి చిందర వందరగా నిరోధ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు



భద్రతా చర్యలు తీసుకోక పోవడంతో శిథిలమవుతోన్న టెస్ట్ ట్యూబ్‌లు

'స్పందన' సమస్యలు సకాలంలో పరిష్కరించండి

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 5: స్పందనకు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మిస్సింగ్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి కేసు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల పేరిట పలువురు మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాల న్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ప్రసాద్, నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మహిళ సమస్యను వింటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

రైళ్లలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- బాధ్యతలు స్వీకరించిన రైల్వే డీఎస్పీ

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 5: నెల్లూరు రైల్వే డీఎస్పీగా నియమితులైన సీ విజయభాస్కర్ రావు సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. డీఈవీ కార్యాలయం లో వెయిటింగ్‌లో ఉన్న ఆయనను ఇటీవల జరిగిన డీఎస్పీల బదిలీల్లో నెల్లూరు రైల్వే డీఎస్పీగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైళ్లలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. పాత నేరస్థుల కదలికలపై నిఘా పెంచడంతోపాటు బీట్ వ్యవస్థ ను పటిష్టం చేసి నేరాలను కట్టడి చేస్తామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా రైళ్లలో తనిఖీ లు ముమ్మరం చేసి నగదు, మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు నెల్లూరు, ఒంగోలు సీఐలు కే భుజంగరావు, ఎస్ శ్రీకాంత్ బాబు, చీరాల, కావలి, నెల్లూరు, గూడూరు ఎస్ఐలు సీహెచ్ కొండయ్య, టీ అరుణకుమారి, ఎన్ హరిచందన, జీ మాలకొండయ్య, ఎన్ కొండప్పనాయుడు, సిబ్బంది పీవీ సురేష్‌బాబు, ఆనంద్ తదితరులు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.



విద్యార్థులకు త్రుటిలో తప్పిన ప్రమాదం



కింద పడిన శ్లాబు పెచ్చులు

సంగం, ఫిబ్రవరి 5: మండలంలోని పల్లిపాళెం పాఠశాల విద్యార్థులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. సోమవారం విద్యార్థులు తరగతి గదిలో కూర్చొనుండగా ఒక్కసారిగా శ్లాబు పెచ్చులూడి కింద పడింది. ఆ సమయంలో విద్యార్థులు అదే గదిలో దూరంగా కూర్చొనుండడంతో ప్రమాదం తప్పింది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాలలో ఐదు తరగతులను కలిపి ఒకే గదిలో నిర్వహిస్తున్నారని, అది కూడా శిథిలాస్థితికి చేరుకుందని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

వృద్ధ దంపతులపై వలంటీరు దాడి

కోవూరు, ఫిబ్రవరి 5: మండల పరిధిలోని వేగూరు గ్రామంలో ఓ వలంటీరు పాత కక్షలతో వృద్ధ దంపతులపై దాడికి పాల్పడినట్లు సోమవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల కథనం మేరకు.. వేగూరు మజరా వేగూరు కండ్రిగ కాలనీకి చెందిన వృద్ధ దంపతులు కట్టా వెంకట రమణయ్య, వెంకట రమణమ్మకు ఆ ప్రాంత వలంటీరు కుడుముల హరీష్‌కు పాత కక్షలున్నాయి. దీంతో వలంటీరు మద్యం సేవించి ఆదివారం అర్ధరాత్రి కత్తి తీసుకుని వృద్ధ దంపతుల ఇంట్లోకి ప్రవేశించి వీరంగం సృష్టించాడు. కత్తితో పొడిచి ఇద్దరిని గాయపరిచాడు. తమపై వలంటీరు దాడి చేశాడని దంపతులిద్దరూ పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.



బాధితురాలు వెంకట రమణమ్మ

బార్ ముందున్న బంకు తొలగింపు

కావలి. ఫిబ్రవరి 5: స్థానిక బంగ్లావీధిలో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఉన్న బంకును సోమవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. అక్కడ బార్‌అండ్ రెస్టారెంట్‌తో ఇబ్బందులు ఉన్నాయని, గతంలో ఆ ప్రాంతవాసులు ఆం దోళన చేశారు. మళ్లీ దాని ముందు పెద్ద బంకు పెట్టడంతో స్థానికుల కోరిక మేరకు మాజీ ఫ్లోర్ లీడర్ కనమర్లపూడి వెంకటనారాయణ వ్యతిరేకించినా నిర్వాహకులు లెక్క చేయకుండా బంకు పెట్టారు. దీంతో ఆయన మున్సిపల్ అధికారులకు చెప్పి వారి చేత దాన్ని తొలగింపచేశారు.



మహిళను మోసం చేసిన వ్యక్తిపై కేసు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 5: వివాహమైన విషయాన్ని దాచిపెట్టి మహిళకును మోసగించిన వ్యక్తిపై బాలాజీనగర్ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని ముత్యాలపాలెంకు చెందిన ఓ మహిళకు వివాహమై భర్త మృతి చెందగా ఇద్దరు పిల్లలున్నారు. ఆమె నగరంలోని జీజీహెచ్‌లో శానిటరీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తుంది. అక్కడ పనిచేస్తున్న షేక్ షబ్బీర్‌అహ్మద్ ఆమెతో సన్నిహితంగా ఉంటూ మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకున్నారు. కొంతకాలం తర్వాత ఆమెను ఇబ్బందులు పెట్టడంతో ఆమె అతని గురించి విచారించగా అతనికి గతంలోనే వివాహం అయిన విషయం తెలిసింది. దీంతో అతన్ని నిలదీయగా చంపుతానని బెదిరించడంతోపాటు వ్యక్తిగతంగా తీసుకున్న ఫొటోలు అందరికి పంపుతానని బెదిరించాడు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ పీ.విజయ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	133
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5953
వెండి కిలో ధర	రూ. 72,400
వెండి ఒక గ్రాము	రూ. 74.40

ప్రశాంతంగా ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్



పరీక్షలను పరిశీలిస్తున్న ఆర్ఐవో శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 5 : ఇంటర్మీడియట్ ఒకేషనల్ ప్రాక్టికల్స్ సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు జిల్లా వ్యాప్తంగా ఉదయం జరిగిన పరీక్షల్లో 8 కేంద్రాల్లో 379 మందికి 304 మంది హాజరు కాగా 75 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 382 మందికి 336 మంది హాజరు కాగా 46 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ తీరును ఆర్ఐవో శ్రీ నివాసులు, డీఈసీ సభ్యులు పరిశీలించారు.

ఉప్పు ఉత్పత్తికి సిద్ధం

ఉప్పు ఉత్పత్తికి సిద్ధం చేసిన కయ్యలు



సీజన్ ప్రారంభం కావడంతో ఉప్పును ఉత్పత్తి చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కయ్యలను చదును చేసి ఇసుక చల్లి ఉత్పత్తికి అనుకూలంగా మలుచుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకం, సాయం అందుతుందోనని వారు ఎదురు చూస్తున్నారు. ప్రతి ఏటా జిల్లాలో సుమారు రెండు వేల ఎకరాల్లో ఉప్పు ఉత్పత్తి చేపడతారు. వర్షాకాలంలో ఉప్పు తయారీని నిలుపుదల చేసి, ఉత్పత్తి అయిన ఉప్పును వర్షాకాలం, శీతాకాలంలో విక్రయిస్తారు. ఈ రెండు కాలాల్లో ఉప్పు ఉత్పత్తి తగ్గి ధరలు పెరిగే అవకాశం ఉంది. తీరప్రాంతాల్లో తయారయ్యే ఉప్పు దేశంలోని నలుమూలలకు తరలి వెళ్తోంది.

- కయ్యలను సిద్ధం చేస్తున్నవైనం
- ఏటా వర్షాలకు నష్టపోతున్న సాగుదారులు
- షెడ్లు, గోదాముల ఏర్పాటుకు వినతి
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు

అల్లూరు, ఫిబ్రవరి 5 : తీరప్రాంతమంటే లోతట్టు ప్రాంతం. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసినా లేక తీరప్రాంతంలో వర్షం కురిసినా ఉప్పు కయ్యల్లో నీరు చేరుతాయి. దీనికితోడు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించి ఉప్పు కయ్యల మీదుగా బకింగ్‌హామ్ కెనాల్‌లో కలుస్తాయి. దీంతో ఉప్పంతా కొట్టుకుపోతుంది. ఫలితంగా ఉప్పు రైతులు ప్రతిఏటా నష్టపోతున్నారు..

సహకరించని ప్రభుత్వం

ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ఉప్పు రైతులు తమ సమస్యలను తామే పరిష్కరించుకోవాలి. నష్టాల నుంచి తానే కోలుకోవాలి తప్ప ఏ ప్రభుత్వమూ వీరిపై దయచూపదు. ఉప్పు కయ్యల్లోకి వెళ్లేందుకు రోడ్లు కూడా ఉండవు. దీంతో వర్షాకాలంలో రైతులు ఉప్పు భూముల్లోకి వెళ్లే పరిస్థితి లేదు.

ఏం చేస్తారో...?

వసతులు లేక ఉప్పు రైతులు పడుతున్న వేదన ఎవరికీ అర్థం కావడం లేదు. నోటిదాకా వచ్చిన సంపద నీటిపాలు కావడంతో కడుపు కోతకు గురవుతున్నారు. ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకుంటున్నా ఫలితం ఉండడం లేదు. అధికారులు ఇటీవల ఇస్కపల్లిలో ఉప్పు రైతులతో సమావేశం నిర్వహించారు. ఉప్పును నిల్వ చేసుకునేందుకు ప్లాట్‌ఫామ్‌లు, షెడ్లు, బోర్లు, రోడ్లు వంటివి ఏర్పాటుచేయాలంటూ రైతులు సమస్యలను ఏకరువు పెట్టారు. అయినా ఎలాటి చర్యలు లేదు.

తీవ్రంగా నష్టపోయా...



నాకున్న ఎకరా పొలంలో ఉత్పత్తి చేసుకున్న ఉప్పు మొత్తం గత వర్షాలకు కరిగిపోయింది. అప్పులు ఎలా తీర్చాలి. కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి. ?

- నాటారు వెంకట రమణయ్య, ఇస్కపల్లి శంభునిపాలెం

ఆదుకునే దిక్కు లేదు



ఉప్పు ఉత్పత్తికి బోర్లు అవసరం. రూ.లక్షలు వెచ్చించి బోర్లు వేశాం. తుఫాన్ ధాటికి అవి ధ్వంసమయ్యాయి. ఉప్పు కరిగిపోయి ఒక నష్టమైతే బోర్లు ధ్వంసమై మరో నష్టం ప్రభుత్వాలు ఆదుకోవడం లేదు.

- పురిణి శీనయ్య, ఇస్కపల్లి శంభునిపాలెం

పరిష్కారం కాకుంటే కారణాలు చెప్పండి

- స్పందనలో అర్జీలు స్వీకరించిన కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 5 : స్పందనలో వచ్చిన అర్జీలను పరిష్కరించకపోతే ఎందుకు పరిష్కరించలేదో అర్జీదారులకు కారణం తెలియజేయాని సంబంధిత అధికారులను కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి అవసమైతే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. వచ్చిన అర్జీలే మళ్లీ మళ్లీ రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో లవన్న, డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మయోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. 18 రకాల చేతి వృత్తుల వారికి ఈ పథకం ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జోనల్ ఇంచార్జి ముక్కు రాధాకృష్ణగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గిరికుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
- బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన కసుమూరు పంచాయతీలోని జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జీవీ శేషయ్యపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ హరినారాయణన్‌కు టీఎన్ఎస్ఎఫ్ వెంకటాచలం మండల అధ్యక్షుడు నలబాలపు వెంకటాద్రి వినతిపత్రం సమర్పించారు. ఈ హెచ్‌ఎం వల్ల బాలికలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

భూ కుంభకోణాలపై సమగ్ర విచారణ జరిపించాలి

- కలెక్టరేట్ ఎదుట దళిత సంఘర్షణ సమితి ధర్నా

కావలి డివిజన్‌లో భూ కుంభకోణాలపై సమగ్ర విచారణ జరిపించాలని దళిత సంఘర్షణ సమితి నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి మాట్లాడుతూ కావలి డివిజన్‌లో అనేక మండలాల్లో వందలాది ఎకరాల్లో గ్రావెల్ తవ్వి అమ్ముకుంటున్నారన్నారు. జాతీయ రహదారి పక్కన ఉన్న రుద్రకోటలో ఓ వ్యక్తికి రెవెన్యూ అధికారులు 21 ఎకరాలను ధారాదత్తం చేశారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోవూరు బాబు, వల్లెపు రమణ, ప్రభాకర్, పీ ఇమ్మానియేల్, జరుగుమల్లి విజయరత్నం పాల్గొన్నారు.

నా కేసులో కాకాణి తప్పించుకోలేరు !

- కోర్టులో దొంగతనానికి కుక్కే కారణమట!
- టీడీపీ నేత సోమిరెడ్డి



నెల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : 'కోర్టులో దొంగతనం మొత్తానికి కుక్క అరవడమే కారణమని అప్పటి ఎస్పీ విజయా రావు సెలవిచ్చారు. ఇప్పుడు సీబీఐ కూడా అదే చెప్పింది. వినడానికి అంతా విచిత్రంగా ఉంది. సీబీఐ దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను హైకోర్టు ధర్మాసనం పరిశీలించాల్సి ఉంది. ఆ తర్వాత కేసును క్లోజ్ చేయవచ్చు లేకపోతే మళ్లీ పునర్విచారణకు ఆదేశించవచ్చు. కానీ అప్పుడే కాకాణి భుజాలెగరేసుకోవడం విడ్డూరంగా ఉంది. ప్రస్తుతానికి కుక్క గెలవచ్చేమోగానీ నేను పెట్టిన నకిలీ డాక్యుమెంట్ల కేసులో నుంచి మాత్రం గోవర్ధన్‌రెడ్డి తప్పించుకోలేరు. కనీసం ఏడేళ్ల శిక్ష అనుభవించక తప్పదు' అంటూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం నెల్లూరులోని తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంతర్జాతీయ ముఠాతో రూ.10 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొన్న మంత్రి కాకాణి, తనకు విదేశాల్లో రూ.వందల కోట్ల ఆస్తులున్నాయంటూ నకిలీ పత్రాలు సృష్టించారని సోమిరెడ్డి గుర్తు చేశారు. ఈ కేసులో క్రిమినల్, సివిల్ చర్యల నుంచి కాకాణి తప్పించుకోలేరని పేర్కొన్నారు. నకిలీ డాక్యుమెంట్ల కేసులో సుప్రీంకోర్టుకెళ్లి కండిషనల్ బెయిల్ తెచ్చుకున్న కాకాణి, ఆరు నెలలపాటు రూరల్ పోలీసు స్టేషన్‌లో సంతకాలు పెట్టారని సోమిరెడ్డి గుర్తు చేశారు. అటువంటి నీచ చరిత్ర కలిగిన వ్యక్తి, నేడు తమ నాయకుడు చంద్రబాబును విమర్శించడం సిగ్గు చేటన్నారు. నకిలీ మద్యం, నకిలీ డాక్యుమెంట్లు, భూముల ఆక్రమణ వంటి సీరియస్ కేసుల్లో నిందితుడిగా ఉన్న మంత్రి, తమ నాయకుడికి సవాల్ విసరడం హాస్యాస్పదమన్నారు. కోర్టులో ఫైళ్ల దొంగతనం కేసులో కాకాణి సీబీఐ విచారణ కోరలేదని, జిల్లా జడ్జి నివేదిక ప్రకారం హైకోర్టు సుమోటోగా కేసును స్వీకరించి సీబీఐకు అప్పగించిందని చెప్పారు.

కావలి కాలువకు నీటిని తగ్గించొద్దు

జలదంకి మండల రైతుల విజ్ఞప్తి

జలదంకి, ఫిబ్రవరి 5: అయ్యా.. కలెక్టర్‌గారు.. దండం పెట్టి చెబుతున్నాం... కావలి కాలువకు సోమశిల జలాలు తగ్గించవద్దు.... అంటూ మండల రైతులు వేడుకున్నారు. సోమవారం మండలంలోని చిన క్రాక వద్ద సీబీఆర్‌లోకి నీరు వెళ్లే ఇన్‌ఫాల్ వద్దకు వారు చేరుకుని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమశిల జలాలను పరిశీలించిన టీడీపీ నాయకులు, రైతులు అవాక్కయ్యారు. వెంటనే అక్కడున్న సోమశిల జేఈ రామారావుతో నీటి విడుదల విషయమై మాట్లాడారు. అనంతరం విలేకరులతో వారు మాట్లాడారు. సోమశిల జలాలు అందరికీ అందేలా నీటి విడుదల ను 600క్యూసెక్కులకు పెంచాలని మంత్రి కాకాణి ఆదేశించారని పేర్కొన్నారు. సక్రమంగా నీటి విడుదల చేయకుంటే ఈనెల 8న ఆమరణదీక్ష చేపతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతునాయకుడు కే అప్పలయ్యనాయుడు చేతు లెత్తి దణ్ణాం పెడుతూ కాలువకు నీరు తగ్గించడం పట్ల సుమారు రూ.100 కోట్లను రైతులు నష్టపోతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రైతు నాయకుడు కే అప్పలయ్యనాయుడు, టీడీపీ నేతలు పీ మధురెడ్డి, పూనూరు భాస్కర్‌రెడ్డి, పచ్చా పెంచలయ్యనాయుడు, కంచర్ల వినోద్ నాయుడు, మట్టెపు కొండలరావు, మాదిరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్నరైతు నాయకుడు అప్పలయ్యనాయుడు

రైతులకు రూ.40 వేలు చెల్లించాలి

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 5 : నకిలీ విత్తనాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40వేల పరిహారం చెల్లించాలని కోరుతూ తెలుగు రైతు సంఘం నాయకులు సోమవారం కలెక్టర్ హరినారాణకు వినతిపత్రం సమర్పించారు. తెలుగు రైతు రాష్ట్రప్రధాన కార్యదర్శి రావూరు రాధాకృష్ణమనాయుడు మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు బీపీటీ 5204 విత్తనం అని చెప్పి నకిలీ విత్తనాలను సరఫరా చేశారన్నారు. ఈ విత్తనాల వలన 35 రోజులకు కంకి తీసిందన్నారు. దీనిపై విచా రణ జరిపిన అధికారులే నాసిరకం అని తేల్చారన్నారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకురావటంతో క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేశారన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి ఈ విత్తనాల విషయంలో నష్టపోయిన రైతుల విషయం పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లినేని రామారావు, గంగపట్నం రమణయ్య, మూలే వెంగయ్య, మాతూరి శ్రీనివాసుల రెడ్డి, నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

29లోగా దుకాణాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 5 : జిల్లాలో వ్యాపార, వర్తక, వాణిజ్య సంస్థలు, మోటారు రవాణా వాహనాలు విక్రయించే దుకాణాలతో పాటు అన్ని వ్యాపార దుకాణదారులు ఈ నెల 29వ తేదీలోగా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించాలని జిల్లా కార్మిక అధికారి ఎం.వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం తన చాంబర్‌లో వర్తక వాణిజ్య సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ అధ్యక్షుడు దాసా లక్ష్మీనారాయణ, వాసవీ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచికంటి శ్రీనివాసులు, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్య క్షుడు టీవీ.కిషోర్, కార్మిక అధికారులు ఎస్‌కే గౌస్, కే రామారావు, ఐ వెంకటేశ్వర్లు, ఎస్ శ్రీనివాసనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసే వరకు పోరాటం ఆగదు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 5 : సీపీఎస్ రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదని బీటీఏ నేతలు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, సీపీఎస్ రద్దు కోరుతూ బీటీఏ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ ధర్నాచౌక్ వద్ద జరిగిన ధర్నాలో జిల్లాకు చెందిన బీటీఏ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాసా ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం చేసిందని, తమ సమస్యలు పరిష్కరించకుండా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఉపాధ్యాయ బకాయిలను చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులు కలిగించడంతో పాటు సీపీఎస్ రద్దు చేస్తానని ఇచ్చిన హామీ కూడా పక్కదారి పట్టించిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ పద్ధతులు మార్చుకుని న్యాయం చేయాలని, లేనిపక్షంలో పోరాటాలు చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, ఆర్థిక కార్యదర్శి ఆదినారాయణ, జిల్లా అధ్యక్షుడు మణిసుబ్బు, కార్యదర్శి రఘు, ఖాజారహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో ఆందోళన చేస్తున్న బీటీఏ నాయకులు

రాత్రి పూట ఆత్మకూరుకు రాని ఆర్టీసీ బస్సులు

ప్రయాణికుల అవస్థలు



ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 5 : రాత్రి పూట కొన్ని ఆర్టీసీ బస్సులు ఆత్మకూరులోకి రావడంలేదు. దీంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. రాత్రి బస్సు సర్వీసులను ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్ వరకు నడపాలని గతంలో నెల్లూరు ఆర్టీసీ అధికారులు కర్నూలు, కడప డిపో అధికారులకు ప్రతిపాదనలు పంపారు. అయితే వారి ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. పొద్దుటూరు, అనంతపురం, కడప, కర్నూలు, పులివెందల, బళ్లారి, తదితర ప్రాంతాల నుంచి రాత్రిపూట సుమారు 10 ఆర్టీసీ బస్సులు తిరుగుతాయి. ఆ బస్సులన్నీ నెల్లూరుపాళెం సెంటర్‌లోనే ప్రయాణికులను దించేసి వెళ్లిపోతుంటాయి. ఈ బస్సులు నెల్లూరుపాళెం సెంటర్‌కు చేరే సరికి రాత్రి 11 నుంచి ఒంటి గంట దాటుతుంది. దాంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. ఆ సమయంలో నెల్లూరుపాళెం సెంటర్‌లో ఆటోలు ఉంటే వాటిని ఆశ్రయిస్తారు. లేదంటే కాళ్లకు పని చెప్పాల్సి వస్తుంది.

బైపాస్ రైడర్లతో అవస్థలు

బైపాస్ రైడర్ల పేరుతో ఆర్టీసీ ఆత్మకూరులోకి బస్సులు నడపడం లేదు. పగటిపూట సైతం నెల్లూరుపాళెం సెంటర్‌లోనే ప్రయాణికులను దించేసి వెళుతున్నాయి. ముఖ్యంగా నెల్లూరు, ఉదయగిరి డిపోలకు చెందిన ఎక్కువ బస్సులు ఈ ధోరణిని అవలంబిస్తున్నాయి. ఆత్మకూరు డిపో నుంచి నెల్లూరుకు బస్సులు ఉన్నాయికదా అంటూ ఆర్టీసీ అధికారులు చెప్పి తప్పించుకుంటున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి రాత్రిసర్వీసులను ఆత్మకూరు ఆర్టీసీ డిపో వరకు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బీఎల్‌వోలు బాధ్యతగా పని చేయాలి



బీఎల్‌వోలకు సూచనలిస్తున్న గిరీష్

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 5: మండలంలోని బీఎల్‌వోలు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఇన్‌చార్జి తహసీల్దారు ఎం గిరీష్ పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో బీఎల్‌వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచురించిన ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి డబుల్ ఎంట్రీలు, మృతుల ఓటర్లను గుర్తించి తొలగించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారినుంచి ఫారం-6ను స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో బైపాస్ రైడర్లు నడపాలి : సీపీఎం



ఆర్టీసీ డీఎం కరీమున్నీసాకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 5: ప్రజల సౌకర్యార్థం బైపాస్ రైడర్లు ఆత్మకూరు పట్టణంలోకి వచ్చే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేర వారు సోమవారం ఆర్టీసీ డీఎం కరీమున్నీసాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయగిరి డిపో బస్సులతోపాటు కడప, కర్నూలు, అనంతపురం, కల్యాణ దుర్గం తదితర బస్సులు పట్టణంలోకి వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె డేవిడ్‌రాజు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, వాగాల శ్రీహరి పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 5: మండలంలోని పంచాయతీలకు ఇటీవల రెండో విడత మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రాధాన్యత క్రమంలో ఖర్చు చేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ పేర్కొన్నారు. సోమవారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ 17 పంచాయతీలకు రూ.86,21,823 మంజూరయ్యాయన్నారు. ప్రధానంగా తాగునీటి సరఫరా సిబ్బంది, క్లాప్‌మిత్ర వేతనాలు, వీధిదీపాల మరమ్మతులు, పూర్తయిన పనులకు బిల్లులు, పారిశుధ్యం పనులకు సంబంధించిన చెల్లింపులను వెంటనే చేపట్టాలని ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. అలాగే గ్రామ అభివృద్ధి ప్రణాళికలను తయారుచేసి వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రేణుకా, ఈవోపీఆర్డీ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ సరఫరా చేయాలి

సంగం, ఫిబ్రవరి 5: పక్కా గృహాలకు గత కొంత కాలం నుంచి సిమెంట్ సరఫరా చేయకపోవడంతో నిర్మాణాలు మధ్యలో ఆగిపోయాయని మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు సోమవారం స్పందన కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావుకు ఫిర్యాదు చేశారు. హౌసింగ్ అధికారులు వెంటనే సిమెంట్ సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు స్పెషల్ డ్రైవ్



ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లులా

ఆత్మకూరు, ఫిబ్రవరి 5: మున్సిపాల్టీ పరిధిలో పారిశుధ్యం మెరుగుదలకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లులా తెలిపారు. సోమవారం ఆయన మున్సిపాల్టీ పరిధిలోని 5వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, స్థానిక కౌన్సిలర్లతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. పట్టణంలోని మురికి కాలువలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయని ప్రజలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుధ్యం మెరుగుదలతో పాటు దోమల నివారణ చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెపీసీ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, వైసీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ మహబూబ్ బాషా, పొడమేకల పెంచలయ్య, మొలబంటి రాజశేఖర్, పలువురు వైసీపీ నాయకులు, మున్సిపల్ అధికారి ఖాసీం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు సన్మానం



తహసీల్దారును సన్మానిస్తున్న సర్పంచులు, నాయకులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 5: మండల తహసీల్దారుగా కె నెహ్రూబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం మండల వైసీపీ నాయకులు, సర్పంచులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డి, సర్పంచ్ సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, నాయకులు ఉప్పుటూరి హరి, అశోక్‌కుమార్, ఇత్తడి రమణ, మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 5: మండలంలోని దాసరిపల్లి గ్రామంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను సోమవారం ఏపీవో బీ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా మస్టర్లను తనిఖీ చేసి కూలీల హాజరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూలీలు కొలతల ప్రకారం పనిచేస్తూ గిట్టుబాటు కూలి పొందాలన్నారు. ఏప్రిల్ నుంచి కూలీలకు ఫేస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇకనుంచి ఉపాధి హామీ ద్వారా రైతులకు సంబంధించిన పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

సంగం తహసీల్దారుగా రమాదేవి

సంగం, ఫిబ్రవరి 5: సంగం తహసీల్దారుగా బి రమాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా సంగంలో పనిచేస్తున్న తహసీల్దారు నాగరాజు బాపట్ల జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా కొమరోలు నుంచి బి రమాదేవిని సంగం తహసీల్దారుగా నియమించారు. దీంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు.

ఓపీఎస్‌ను అమలుచేసే వారికే మా ఓట్లు : యూటీఎఫ్



ఉదయగిరి రూరల్: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 5 : ఎవరైతే ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీం)ను అమలుచేస్తారో వారికే మా ఓట్లు వేస్తామని యూటీఎఫ్ నేతలు ప్రతిన బూనారు. స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం ఓట్ ఫర్ సీపీఎస్ అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వివిధ రాజకీయ పార్టీలకు పోస్టుకార్డు ద్వారా తమ వినతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాధర్, శివప్రసాద్‌రావు, ఆత్మకూరు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ రామ్మోహనరావు, షేక్ ఖాదర్‌బాష, అనంతసాగరం, ఏఎస్‌పేట, మర్రిపాడు మండలాల యూటీఎఫ్ నాయకులు సుధాకర్, వెంకటేశ్వర్లురెడ్డి, హెచ్ హరికృష్ణ, మస్తాన్, షేక్ కాలేషా, కె మల్లికార్జున పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం నాయకులు మన ఓటు-మన భవిష్యత్తు అనే నినాదంతో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, నాయబ్‌బాష, హనీఫ్, ఫణిరాజు, సుబ్బారెడ్డి, దుర్గాప్రసాద్, వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


వింజమూరు తహసీల్దారుగా కృష్ణారెడ్డి

వింజమూరు, ఫిబ్రవరి 5: వింజమూరు మండల నూతన తహసీల్దారుగా ఎంవి కృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా కరీముల్లా నియామకం

ఉదయగిరి, ఫిబ్రవరి 5: ఉదయగిరి మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా శకునాలపల్లి పంచాయతీ కార్యదర్శి షేక్ కరీముల్లాను నియమించినట్లు ఎంపీడీవో ఈశ్వరమ్మ సోమవారం తెలిపారు. ఉదయగిరి పంచాయతీ ఈవోగా పనిచేస్తున్న నరసయ్య వెంకటాచలం మండలం చెముడుగుంట పంచాయతీకి బదిలీ కావడంతో ఆయన స్థానంలో కరీముల్లాకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించామన్నారు.

ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలి : సీఐటీయూ



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 5: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి మళ్లీ ఓట్లు అడిగేందుకు ప్రజల వద్దకు వెళ్లాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కార్యకర్తలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చకపోవడంతోపాటు ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై మరింత భారం మోపడం దారుణమన్నారు. మోదీ ప్రభుత్వం ఒక మతానికి ప్రతినిధిగా మారి మైనారిటీలు, దళితులపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రోడ్లపై తట్టెడు మట్టి వేసిన పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం, సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, ఫరుద్దీన్‌బాషా, గుజ్జుల మల్లికార్జున, కోడె రమణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టుకొని వదిలేశారు

అనంతసాగరం, ఫిబ్రవరి 5: మండలంలోని పాతదేవరాయపల్లిలో ఆదివారం రాత్రి సెబ్ అధికారులు ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కొంత సమయానికి వదిలేశారు. తనిఖీ అధికారులంటూ చెప్పి రూ. 10 వేలు తీసుకొని వదిలేసినట్లు సమాచారం. స్థానికంగా ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

దుర్గంధం వెదజల్లుతున్న వీధులు

● ప్రజల అవస్థలు



వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 5: పట్టణంలోని నాగులబావి, సుద్దబావివీధులు చెత్తమయంగా మారి దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. గత కొన్ని రోజుల క్రితం పంచాయతీ కార్మికులు మురికి కాలువల్లో పూడిక తీసి రోడ్లపై వేశారు. తీసిన పూడికను రోజులు గడుస్తున్నా తొలగించకపోవడంతో వీధులన్నీ చెత్తమయంగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

కలిగిరిలో వానరాలు, శునకాల స్వైర విహారం



కలిగిరి, ఫిబ్రవరి 5: పట్టణంలో వానరాలు, శునకాలు స్వైరవిహారం చేస్తూ దాడులు చేస్తున్నాయి. దీంతో ప్రజలు భీతిలుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద వీటి సంచారం ఎక్కువగా ఉంది. చిన్నారులు పాఠశాలకు వెళ్తుండగా వీధి కుక్కలు దాడి చేస్తుండడంతో ఒంటరిగా వారిని పాఠశాలకు పంపాలంటే తల్లిదండ్రులు హడలిపోతున్నారు. వీధికుక్కలపై నియంత్రణ లేకపోవడంతో వీధుల్లో గుంపులుగా తిరుగుతున్నాయి. ప్రజలపై దాడులకు యత్నిస్తున్నాయి. దీనికితోడు కోతులు కూడా ఇళ్లలోకి చొరబడి మహిళలపై దాడులకు దిగుతున్నాయి. పట్టణంలో కోతులు, కుక్కలను నిర్మూలించడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా వాటి అదుపునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

దుష్టశక్తులను తరిమికొడదాం : కావ్య

కావలి,ఫిబ్రవరి 5: కావలిలో మనందరి ముందున్న ప్రధాన సమస్య దుష్టశక్తుల పాలన, దాన్ని తరిమికొట్టి తిష్టవేసి ఉన్న అవినీతిపరులను అంతం చేద్దామని కావలి టీడీపీ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. అహింసా పట్టణంగా ఉన్న కావలిని హింసా పట్టణంగా మార్చారని పేర్కొన్నారు. కావలి అంటేనే భయపడేలా చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి తన ఇంటికి తాళం వేసుకుని, కావలిని వదలివెళ్లకపోతే, తాను అరగుండు గీయించుకుని తిరుగుతానన్నారు.

● **పలువురి అభినందన**

దగ్గుమాటి వెంకటక్రిష్ణారెడ్డి(కావ్య)ని కావలి టీడీపీ ఇన్‌చార్జిగా నియమించడంతో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు ముసునూరులోని కావ్య ఆయన వద్ద కోలాహలం నెలకొంది. బాణసంచా కాల్చి, కేకులు కట్‌చేస్తూ, పూలమాలలు, బొకేలు, శాలువాలతో కావ్యను పలువురు అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

● **టీడీపీ పట్టణ అధ్యక్షుడికి సన్మానం**

కావలి పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా నియమితులైన గుత్తికొండ కిషోర్‌బాబు సోమవారం పార్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నేతలు గుత్తికొండను కలిసి పూలమాలలు,శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుంటుపల్లి శ్రీదేవిచౌదరి, పోతుగంటి అలేఖ్య, మొగిలి కల్లయ్య, జ్యోతిబాబూరావు, కాకి ప్రసాద్, అన్నపూర్ణ శ్రీను, ద్రోణాదుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

● **కావ్య గెలుపునకు కృషి**

బిట్రగుంట : కావలి నియోజకవర్గ ఇన్ చార్జిగా నియమితులయిన దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి) గెలుపునకు అంకిత భావంతో పని చేస్తామని బోగోలు మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు పనిచేస్తామని తెలిపారు. అనంతరం కావ్యను కావలిలోని ఆయన స్వగృహంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ సుధీర్‌బాబు, కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, రావి విజయ్‌కుమార్‌యాదవ్, పుట్టా సుబ్బారావు, గడ్డెకొండయ్య తదితరులు పాల్గొన్నారు.



కావలి : కావ్య కృష్ణారెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు



కిషోర్‌బాబును సత్కరించిన తెలుగుదేశం నేతలు

బదిలీపై వచ్చిన తహసీల్దార్లు బాధ్యతల స్వీకరణ



కావలి నగేష్ | అల్లూరు దుర్గేశ్వరరావు | బోగోలు క్షమారాణి | లింగసముద్రం శ్రీచరణ్

అల్లూరు, ఫిబ్రవరి 5 : అల్లూరు తహసీల్దారుగా ఎస్.దుర్గేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమై మండలంలోని గ్రామాల పరిస్థితులపై సమాచారం తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీటీలు నాగలక్ష్మి, సైమన్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : లింగసముద్రం తహసీల్దార్‌గా జీ శ్రీచరణ్ సోమవారం విధుల్లో చేరారు. ఇన్‌చార్జి తహసీల్దార్ టీ ప్రసాద్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

కావలి రూరల్ : కావలి తహసీల్దార్‌గా కె. నగేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లా ఈపూరు తహసీల్దార్‌గా పనిచేసిన నగేష్ బదిలీపై కావలి వచ్చారు.

బిట్రగుంట : బోగోలు తహసీల్దారుగా ఎం.క్షమారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డీటీ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐలు, వీఆర్వోలు, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో రాజీపడేది లేదని ఆమె తెలిపారు.

కందుకూరులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ



కరపత్రాలు పంచుతున్న ఇంటూరి నాగేశ్వరరావు, తదితరులు

కందుకూరు, ఫిబ్రవరి 5: పట్టణంలోని 4వ వార్డు పరిధిలోని బలరామయ్యతోట ప్రాంతంలో టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని చంద్రబాబు ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, మచ్చ మనోహర్, నందనవనం రాము, శేఖర్, నందికనమళ్ల లక్ష్మణరావు, పేలా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కావలి కాలువకు నీరివ్వాలంటూ ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

జలదంకి, ఫిబ్రవరి 5 : మండలంలో నిలువుమీద ఉన్న వరి, ఆరుతడి పంటలకు తక్షణమే కావలి కాలువ ద్వారా సాగునీరివ్వాలంటూ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు, కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు తాళ్లూరి మాల్యాద్రి మాట్లాడుతూ మండలంలో నిలువుమీద ఉన్న వరిపైరు, ఆరుతడి పంటలకు కాలువల ద్వారా సాగు నీరు ఇచ్చి రైతులను కాపాడాలన్నారు. రైతుసంఘం నేత రావి మాల్యాద్రి, కాంగ్రెస్ నాయకుడు వీ.శివశేఖర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దారు భరత్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసనలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కండి : బీజేపీ



మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

కావలిటౌన్, ఫిబ్రవరి5: ఎన్నికలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో నమస్కార్ సమావేశ మందిరంలో నియోజకవర్గ సమావేశం జరిగింది. కన్వీనర్ సీవీసీ సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలన్నారు. అనంతరం ఎన్నికల ప్రచారంపై కమిటీలను నియమించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి దయాకర్‌రెడ్డి, నాయకులు కందుకూరి సత్యనారాయణ, జీ భరత్‌కుమార్, బ్రహ్మానందం, వీవీ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా ఉపకరణాల పంపిణీ

కొండపురం, ఫిబ్రవరి5: మండల పరిధిలోని కుంకువారిపాలెం ఎంపీపీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం విద్యా ఉపకరణాల పంపిణీ జరిగింది. గ్రామానికి చెందిన బొట్లగుంట మాలకొండయ్యనాయుడు 29వ వర్థంతి సందర్భంగా ఆయన కుమారులు కొండపనాయుడు, మాల్యాద్రి, హరిబాబులు విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఆటవస్తువులు,భోజనప్లేట్లు అందచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మద్దసాని యశోదమ్మ, అంగన్‌వాడీ దొరసానమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో కంటి వ్యాధుల దూరం

కావలి రూరల్, ఫిబ్రవరి5: పౌష్టికాహారంతో కంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ సరళాదేవి పేర్కొన్నారు. ముసునూరు టోల్‌ప్లాజా వద్ద సోమవారం జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. టోల్‌ప్లాజా సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా మేనేజర్ గణేష్, ఆపరేషన్ మేనేజర్ ఆనంద్ సింగ్, పీఆర్వో నరసింహరావు, సేఫ్టీ మేనేజర్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

లింగసముద్రం, ఫిబ్రవరి 5: మండలంలోని పెదపవనిలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె హేమలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నాలుగవ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులు అర్హులని చెప్పారు.వీరు ఈ నెల 23వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు అభ్యర్థులు మీ సేవలో గానీ, మీ దగ్గరలోని గురుకుల విద్యాలయాలను కానీ సంప్రదించాలన్నారు.

ప్రమాదాల నివారణకే భద్రతా మాసోత్సవాలు

కావలి రూరల్ : ప్రమాదాల నివారణకే రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్టీవో వై. సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కావలి పట్టణ ఏరియా వైద్యశాల, ప్రవీణ్ ఆర్థో మల్టీస్పెషాలిటీ వైద్యశాలల్లో సోమవారం మంచి ప్రదాత చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంవీఐ సుందరరావు, అసిస్టెంట్ ఎంవీఐ కరుణాకర్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, రెడ్‌క్రాస్ బాధ్యుడు రవిప్రకాష్, మారుతి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు పని చేస్తాం

ఉలవపాడు, ఫిబ్రవరి 5 : రాబోవు ఎన్నికల్లో టీడీపీ గెలుపే ప్రధానంగా గ్రామాల్లో పనిచేస్తామని మండల టీడీపీ సీనియర్ సిటిజన్స్ పేర్కొన్నారు. సోమవారం ఉలవపాడులోని సీనియర్ సిటిజన్ కార్యాలయంలో సీనియర్లు, పార్టీ అభిమానుల సమావేశం జరగింది. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆవుల నరసింహరావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండింటిని అమలు చేయగల సత్తా ఒక్క చంద్రబాబు నాయుడుకి మాత్రమే ఉందన్నారు. టీడీపీ-జనసేన ప్రభుత్వ ఏర్పాటుకు తమ వంతుగా గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి పనిచేయాలన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు ఎం. వెంకయ్య, మెత్తాళ్ల ప్రసాదు పాల్గొన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించండి

లింగసముద్రం, ఫిబ్రవరి 5: రెండేళ్ల నుంచి రద్దు చేసిన కొండాపురం-కందుకూరు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. అయినా కందుకూరు ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలకు లింగసముద్రం మీదుగా కొండాపురం వచ్చి, 8 గంటలకు లింగసముద్రం మీదుగా కందుకూరు వెళ్లే ఈ బస్సును అధికారులు కలిగిరి వరకు పొడిగించారు. ఇది ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేది. దాన్ని రద్దు చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ఆ సర్వీసును పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

మైక్రో కంట్రోలర్ రూపకల్పనపై వర్క్‌షాప్

కందుకూరు, ఫిబ్రవరి 5: పారిశ్రామిక, గృహోపకరణాలలో ఉపయోగించే మైక్రో కంట్రోలర్ బోర్డుల రూపకల్పనకు ఆర్డినో ప్రోగ్రామింగ్ లాంగ్వేజీ ఉపయోగపడుతుందని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షకుడు బీ మహేందర్ వెల్లడించారు. మైక్రో కంట్రోలర్ బోర్డుల రూపకల్పనపై వారంపాటు జరిగే వర్క్‌షాప్ సోమవారం ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లో అంతర్జాతీయంగా ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్న కోర్సులను పరిచయం చేస్తామన్నారు. కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ నైపుణ్యాలను మెరుగుపరచటం కోసమే వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్, ఈసీఈ విభాగ అధ్యాపకుడు డాక్టరు కే హనుమంతరావు, ఐ. రామకోటేశ్వరరావు, ఎన్.శ్రీహరి, ఎస్. మాధవ, జీ సురేష్, ఎస్కే మస్తాన్‌వలి, కిషోర్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానం దారి ఆక్రమణపై ఫిర్యాదు

ఉలవపాడు, ఫిబ్రవరి 5: శ్మశానం దారిని ఆక్రమించారని కరేడు అరుంధతీ కాలనీవాసులు సోమవారం ఇన్‌చార్జి తహసీల్దార్ వీరయ్యకు వినతిపత్రం అందించారు. గ్రామానికి చెందిన ఓరుగంటి రెడ్లు 15 అడుగుల దారిని ఆక్రమించారని వారు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు. వీఆర్వో, విలేజ్ సర్వేయర్లను పంపించి పరిశీలిస్తామని తహసీల్దార్ చెప్పినట్లు బాధితులు చెప్పారు.

నాణ్యమైన పొగాకుపై దృష్టి పెట్టాలి

లింగసముద్రం, ఫిబ్రవరి 5 : రైతులు నాణ్యమైన పొగాకు ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని దక్షిణ ప్రాంత తేలిక నేలల ప్రాంతీయ అధికారి ఎం. లక్ష్మణరావు చెప్పారు. సోమవారం మండలంలోని ఎర్రారెడ్డిపాలెంలో పొగాకు పంటను కందుకూరు బోర్డు అధికారులు, సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు, ఐటీసీ అధికారులు, రైతులతో కలిసి పరిశీలించి, అవగాహన కల్పించారు. పంటకు వచ్చిన ఆకులను రెలచాలని, నేలపై పట్టలు పరిచి రెలిచిన ఆకులను ఉంచాలన్నారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి కే రాజగోపాల్, సీటీఆర్ఐ శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు, ఐటీసీ ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్‌బాబు, మేనేజర్ ఎ రామాంజనేయులు, సాంకేతిక అధికారి దీప్తి, సాంకేతిక సహాయకుడు నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మణరావు తదితరులు

ఎన్నికల నాటికి వైసీపీ పూర్తిగా ఖాళీ : సోమిరెడ్డి



పొదలకూరు : జయహో బీసీ ర్యాలీలో టీడీపీ నాయకులు

వెంకటాచలం, ఫిబ్రవరి 5 : సర్వేపల్లి టీడీపీలోకి వలసలు జోరుగా కొనసాగుతున్నాయని, ఎన్నికల నాటికి వైసీపీ పూర్తిగా ఖాళీ అవ్వడం ఖాయమని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని సోమిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో సోమవారం పుంజులూరుపాడు గ్రామానికి చెందిన 18 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి సోమిరెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సర్వేపల్లిలో ఓటమి ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, నాయకులు వెంకటకృష్ణయనాయుడు, మల్లికార్జున్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, దాసి చక్రధర్, మహేంద్రనాయుడు తదితరులున్నారు

యర్రబల్లిలో 20 కుటుంబాలు చేరిక

పొదలకూరు : మండలంలోని నేదురుపల్లి పంచాయతీలోని యర్రబల్లిలో బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ మంత్రి కాకాణి ఈసారి ఎన్నికల్లో గెలిస్తే నడిరోడ్డులో సర్వేపల్లిని అమ్మేస్తాడన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ - జనసేన ప్రభంజనం సృష్టించబోతుందన్నారు. అనంతరం బెల్లంకొండ తిరుపతి, బత్తల అంజయ్య ఆధ్వర్యంలో పార్టీలో చేరిన 20 కుటుంబాల వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు, రవీంద్రనాయుడు, కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, యర్రబల్లి నాయకులు మాదాల నల్లపనాయుడు, భాస్కర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు టీడీపీ పుట్టినిల్లు

బీసీ వర్గాలకు టీడీపీ పుట్టినిల్లు లాంటిదని సోమిరెడ్డి అన్నారు. పొదలకూరులోని బోగోలు కృష్ణారెడ్డి కల్యాణ మండపంలో సోమవారం టీడీపీ నియోజకవర్గ స్థాయి జయహో బీసీ సదస్సు జరిగింది. ముందుగా పట్టణంలోని సంగంరోడ్డు కూడలి నుంచి కృష్ణారెడ్డి కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో సోమిరెడ్డి, టీడీపీ బీసీ నాయకులు రుద్రకోట సదాశివం, సంపత్ మాట్లాడుతూ జగన్ పాలనలో బీసీలకు ఎటువంటి మేలు జరగలేదన్నారు. సర్వేపల్లి దుర్మార్గాలకు నెలవుగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, పెంచలరావు, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వల్లేపు మునిస్వామి, మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, గుమ్మడి రాజా యాదవ్, పల్లవరపు కృష్ణయాదవ్, వెంపులూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ పేరుతో తాగునీటి పథకం

బుచ్చిరెడ్డిపాళెం,ఫిబ్రవరి5: పట్టణ ప్రజల తాగునీటి కోసం సంగం బ్యారేజీ వద్ద నుంచి బుచ్చి వరకు చేపట్టిన నీటి సరఫరా పథకానికి స్వర్గీయ నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి (ఎన్ఎస్ఆర్)రక్షిత నీటి సరఫరా పథకంగా నామకరణం చేశారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్(ఎంఏయుడీ)శాఖ జీవో నెంబరు12ను సోమవారం విడుదల చేసింది. ఈ పథకానికి నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి పథకంగా నామకరణం చేసేందుకు మూడు క్రితం నగర పంచాయతీ కౌన్సిల్ తీర్మానం చేసింది. ఈ క్రమంలో ఆదేశాలు జారీ అయ్యాయి.

ఇళ్లు కట్టిస్తామని మోసం చేశారు..

● కలెక్టర్‌కు గిరిజనుల ఫిర్యాదు

విడవలూరు, ఫిబ్రవరి 5: పీఎంఏవై కింద ఇళ్లు కట్టిస్తామని, ఉన్న ఇళ్లు కూడా కూల్చేసి అధికారులు మోసం చేశారని మండల పరిధిలోని వావిళ్లకి చెందిన గిరిజనులు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం రాష్ట్ర యానాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసీ. పెంచలయ్య మాట్లాడుతూ నిరుపేదలైన గిరిజనులకు ఆశచూపి ఉన్న ఇళ్లను కూల్చేయడం దారుణమన్నారు. దీంతో వారు ఉన్న నీడను కూడా కోల్పోయి చెట్టుకింద నివాసాలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు అయినా సంబంధిత అధికారులకు చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. బాధిత గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.

కాకాణికి క్లీన్‌చిట్‌పై హర్షం

ముత్తుకూరు, ఫిబ్రవరి 5 : కోర్టు ఫైల్ దొంగతనం కేసులో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సీబీఐ క్లీన్ చిట్ ఇవ్వడంపై జేసీఎస్ ముత్తుకూరు మండల కన్వీనర్ నెల్లూరు శివప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి మాట్లాడుతూ ఆరోపణలు చేసేటప్పుడు నిర్దిష్టమైన ఆధారాలు ఉండాలని అన్నారు. సమావేశంలో వైసీపీ సీనియర్ నాయకులు కాకుటూరు లక్ష్మణరెడ్డి, రాగాల వెంకటేశ్వర్లు, ఎంపీపీ సుగుణ, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, నవీద్‌బాషా, వెంకటేశ్వర్లు, రాజా, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుగా మాధవరెడ్డి

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 5: మండల నూతన తహసీల్దారుగా కే మాధవరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డీటీ శివయ్య, సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు.

కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలి



ఎంఈవో-2కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

బుచ్చిరెడ్డిపాళెం,ఫిబ్రవరి 5 : తమకు కనీస వేతనం రూ. 10వేలు ఇవ్వాలని మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంఈవో-2 పీవీ.రత్నంకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్. మల్లికార్జున మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు, వేతనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకురాళ్లు అన్నపూర్ణమ్మ, భాగ్యలక్ష్మి, నిర్మల, సుభాషిణి, వెంకటరమణమ్మ, సుశీలమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కురుగొండ్లకు టికెట్‌పై టీడీపీ నేతల హర్షం

రాపూరు(డక్కిలి), ఫిబ్రవరి 5 : వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ టికెట్ మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు కేటాయించడం హర్షణీయమని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దందవోలు వెంకటేశ్వర్లు రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఏదోటి కోటేశ్వరనాయుడు, పార్లమెంట్ అధికార ప్రతినిధి నువ్వుల శివరామకష్ణ, ఉపాధ్యక్షుడు కోండ్లపూడి రాఘవరెడ్డి, టీడీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఖాజా, తాతిపల్లి టీడీపీ నాయకుడు తిక్కమనేని ప్రసాద్ నాయుడు, జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి పచ్చిగళ్ల రత్నం అన్నారు. వెంకటగిరిలో రామకృష్ణ విజయం నల్లేరుపై నడకేనన్నారు.

సహకార బ్యాంకును అభివృద్ధి చేస్తా.. : గునపాటి

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 5: ఇందుకూరుపేట సహకార బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపిస్తానని చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గునపాటి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బ్యాంకు ఆవరణంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వే బ్రిడ్జి ఏర్పాటు చేస్తానన్నారు. అలాగే షాపింగ్‌మాల్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు సంగం వెంకయ్య, కృష్ణప్రసాద్‌తోపాటు హనుమంతునాయుడు, రామచంద్ర నాయుడు, రావూరు సర్పంచి వెంకటశేషయ్య, వాసు, తుమ్మతాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు నష్టం కలిగించే సెక్షన్ 106 రద్దుచేయాలి

ముత్తుకూరు, ఫిబ్రవరి 5 : డ్రైవర్లకు నష్టం కలిగించే క్రిమినల్ చట్టంలోని సెక్షన్ 106ను రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పంటపాలెం పామాయిల్ పరిశ్రమ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గడ్డం అంకయ్య, లారీ డ్రైవర్లు, స్థానిక యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

కోవూరు, ఫిబ్రవరి5: సీఐ శ్రీనివాసరావును ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా ఉపాధ్యక్షుడు దానం మాల్యాద్రి సోమవారం ఘనంగా సన్మానించారు. సర్కిల్ కార్యాలయంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించారు. ఆయన వెంట జిల్లా నాయకులు ఉయ్యాల జగన్‌మోహన్, రమణ, సురేష్, రూప్‌కుమార్,నికేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణ

కోవూరు, ఫిబ్రవరి 5: స్థానిక మండల విద్యావనరుల కేంద్రం ఎదుట సోమవారం ఓట్ ఫర్ ఓపీఎస్ గోడ పత్రికను యూటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఉద్యోగుల్ని మోసం చేశారన్నారు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఉద్యోగులందరూ ఆందోళనకు దిగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఖాజావలి, భారతి, శ్రీనివాసప్రసాద్, పుష్పలత, ప్రసన్న, మురళి,రవికుమార్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నరాల వ్యాధులపై నేడు అవగాహన సదస్సు

రాపూరు(డక్కిలి), ఫిబ్రవరి 5 : రాపూరు మండలం వేపినాపి పీహెచ్‌సీలో మంగళవారం నరాల వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు సోమవారం తెలిపాయి. న్యూరాలజిస్టు బిందుమీనన్ నరాల వ్యాధులపై అవగాహన కల్పిస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కసుమూరు పాఠశాల హెచ్‌ఎంని సస్పెండ్ చేయండి

వెంకటాచలం, ఫిబ్రవరి 5: బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న కసుమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంని వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ సోమవారం నెల్లూరు కలెక్టరేటులో జరిగిన స్పందన కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నేతలు వినతిపత్రం అందజేశారు. టీఎన్ఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు నలబాలపు వెంకటాద్రి మాట్లాడుతూ హెచ్‌ఎంగా పని చేస్తున్న జీవీ శేషయ్య గత నాలుగు రోజుల కిందట ఒక బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని, అంతేకాకుండా మద్యం సేవించి విధులకు వస్తున్నారని విద్యార్థులే స్వయంగా చెబుతున్నారని, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి హెచ్‌ఎంపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

వెంకటాచలం, ఫిబ్రవరి 5 : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో సోమవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, వర్సిటీ జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణ, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీసీ సుందరవల్లి విచ్చేసి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని మహిళా చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి బీ సురేష్, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్ బాబు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, డాక్టర్ కే సునీత, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, సమత, రమేష్, శ్రీనివాస్ రావు, నరసింహరావు తదితరులున్నారు.

పేదల అభ్యున్నతే చంద్రబాబు లక్ష్యం

కోవూరు, ఫిబ్రవరి5: పేదల అభ్యున్నతే లక్ష్యంగా మాజీ సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. గుమ్మళ్ళదిబ్బ కాలనీలో సోమవారం జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, మాజీ ఎమ్మెల్సీ బీదాటి రాధాకృష్ణయ్య, నాయకులు చెముకుల కృష్ణచైతన్య, బత్తల హరికృష్ణ, ఉప్పు భాస్కర్, జ్ఞానేంద్ర, కోవూరు మధు, సుభాన్ తదితరులు మాట్లాడారు. కాగా దినేష్‌రెడ్డి నాయకత్వంలో గుమ్మళ్ళదిబ్బ గిరిజనకాలనీలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఆయన వెంట నాయకులు ఇంతా మల్లారెడ్డి, బాలరవి, తిరుమూరు అశోక్‌రెడ్డి, యాకసిరి వెంకటరమణమ్మ, ఉయ్యూరు వేణు, నాటకరాని వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటా ప్రచారంలో మహిళలతో మాట్లాడుతున్న దినేష్‌రెడ్డి

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

క్షతగాత్రులకు సకాలంలో చికిత్స అందించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్వరూపరాణి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 5: ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను వెంటనే వైద్యశాలకు తరలించి సకాలంలో చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని రోడ్డు సేఫ్టీ డాక్టర్ స్వరూపరాణి తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో గుడ్ సమారిటన్ చట్టం గురించి వాహనదారులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహనాల తనిఖీ స్క్వాడ్ అధికారి రాంబాబు, రవాణాశాఖ అధికారులు వీర పూర్ణచంద్రరావు, స్వప్నిల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరురూరల్ తహసీల్దారు బాధ్యతల స్వీకరణ



తహసీల్దారుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీటీ

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 5 : నెల్లూరురూరల్ తహసీల్దారుగా జీవీ సుబ్బారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా ఆయన బాపట్ల జిల్లా అద్దంకి నుంచి నెల్లూరు జిల్లాకు కేటాయించగా నెల్లూరురూరల్ మండలానికి పంపుతూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. ఇక్కడ ఉన్న సోమ్లానాయక్ బదిలీపై ప్రకాశం జిల్లా కు వెళ్లారు. డీటీ గోపి, సిబ్బంది ఆయన పుష్పగుచ్ఛం అంద చేసి శుభాకాంక్షలు తెలిపారు.

పాతకక్షలతో వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 5: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై కొందరు విచక్షణా రహితంగా కత్తులతో దాడి చేసిన ఘటన మెక్లిన్స్ రోడ్డు సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పరమేశ్వరినగర్‌కు చెందిన షేక్ జకీర్ అలియాస్ జక్కా బంగారం లైన్ బిజినెస్ చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. జెండావీధిలోని జవహర్ భారతి స్కూల్ సమీప ప్రాంతానికి చెందిన ముజామిల్ ఆంధ్రాబ్యాంకు సమీపంలో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. జక్కా, ముజామిల్‌లు ఇద్దరు బాడీబిల్డర్‌లు. నాగేళ్ల కిందట జిమ్‌లో వీరిద్దరి మధ్య వివాదం జరిగింది. దీంతో ఇద్దరు దాడులు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి జకీర్ తన అల్లుడైన సోహెయిల్‌తో కలిసి జెండావీధి నుంచి బైక్‌పై ఇంటికి వెళుతూ మెక్లిన్స్‌రోడ్డులోని ఓ దుకాణంలో పాలు, పెరుగు ప్యాకెట్లు తీసుకుని బయలుదేరుతుండగా ముజామిల్ అతని స్నేహితులు పాతకక్షలు మనసులో పెట్టుకుని జకీర్‌ను అడ్డగించి కత్తులతో విచక్షణా రహితంగా దాడి చేశారు. అడ్డుపోయిన సొహెయిల్‌ను తీవ్రంగా కొట్టారు. తీవ్రగాయాలైన జకీర్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో అతను చనిపోయాడని నిర్ధారించుకున్న నిందితులు అక్కడ నుంచి బైక్‌లపై పరారయ్యారు. రక్తపు మడుగులో ఉన్న జకీర్‌ను స్థానికులు సహాయంతో సొహెయిల్ నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ అశోక్ తన సిబ్బందితో కలిసి వైద్యశాలకు చేరుకున్నారు. సాహెయిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

టీడీపీని ఆశీర్వదించండి : రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 5 : వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటేసి ఆశీర్వదించాలని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రజలను కోరారు. సోమవారం నగరంలోని 36వ డివిజన్ శాంతి అపార్టుమెంటు నుంచి ఎమ్మెల్యే కోటంరెడ్డి ఒక్కడే ఒంటరిగా 29వ రోజు కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన రోడ్డుపై వెళుతున్న ప్రతి ఒక్కరిని అప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తాను టీడీపీ తరపున పోటీ చేస్తున్నాని, సైకిల్ గుర్తుకి ఓటేసి గెలిపించాలని కోరారు.

వీపీఆర్ వెంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 5 : రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వెంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు నడుస్తారని దళిత సంఘాల గౌరవాధ్యక్షుడు అల్లం రాజా చెప్పారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ నాయకులంతా వీపీఆర్ వెంట నడుస్తామన్నారు. వీపీఆర్‌కు మద్దతుగా మంగళవారం ఉదయం 10 గంటలకున నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో దళిత సంఘాల సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి దళిత గిరిజన సంఘాల నేతలు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నాయకులు పి మురళి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 5 : రాజ్యలక్ష్మి హాల్, శుభమస్తు షాపింగ్‌మాల్ వ్యవస్థాపకుడు భయ్యా వెంకటరమణయ్య వర్ధంతి సందర్భంగా శుభమస్తు ఫౌండేషన్, లయన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. శుభమస్తు షాపింగ్‌మాల్‌లో జరిగిన కార్యక్రమంలో భయ్యా వెంకటరమణయ్య కుటుంబం, లయన్స్ క్లబ్ సభ్యులు, శుభమస్తు, కంచిపెరుమాళ్‌సిల్క్ సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 5: ఆర్టీసీలో ప్రయాణికులను ఆకర్షించేలా ఆర్టీసీ రెండవ డిపో వారు ప్రవేశపెట్టిన గిఫ్ట్‌స్కీమ్ బాక్సులను సోమవారం తెరిచి లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రెండవ డిపో డీఎం శివకేశవయాదవ్ మాట్లాడుతూ ముత్తుకూరు రూట్‌లో ప్రయాణం చేసే ప్రయాణికుల టికెట్ ద్వారా లక్కీ డిప్‌ను తీసి ఇద్దరు విజేతలను ఎంపిక చేశామన్నారు. మొదటి బహుమతిను కె.రాములు, రెండవ బహుమతి కె.సుభాషిణి ఎంపికయారన్నారు.

జిల్లా గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 5 : జిల్లా గ్రంథాలయానికి సోమవారం కనుపర్తిపాడు సుబ్రహ్మణ్యం స్వామి ఆలయ చరిత్ర పుస్తకాలను విశ్రాంత రెవెన్యూ పరిపాలన అధికారి దంపూరు రామకృష్ణ వితరణ చేశారు. జిల్లాలోని గ్రంథాలయంలో అన్నింటికి ఉచితంగా పంపిణీ చేసేందుకు 90 పుస్తకాలను గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు ప్రసాద్, కృష్ణయ్య, ఈతకోట సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

అమరావతి ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని మాగుంట లే అవుట్‌లో అమరావతి ఫ్యామిలీ రెస్టారెంట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగరం లోని రాజకీయ ప్రముఖులు, హోటళ్ల యజమానులు, 25 కళా సంఘాల కళాకారులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు. ఆ హోటల్ యజమానులు అమరావతి కృష్ణారెడ్డి, అమరావతి విహార్‌రెడ్డి, ఐ.పార్థసారథిరెడ్డిలను అభినందించారు.

దోమలు లేని నగరంగా మారుస్తా : నారాయణ



బాబాకు పూజలు చేస్తున్న నారాయణ, కోటంరెడ్డి

నెల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే నెల్లూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్‌ను పూర్తి చేసి దోమలు లేని నగరంగా మారుస్తానని మాజీ మంత్రి, టీడీపీ సిటీ ఇన్‌చార్జ్ పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. 16వ డివిజన్ చిల్డ్రన్స్ పార్కు ప్రాంతంలో సోమవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సాయిబాబా మందిరంలో పూజలు చేసిన అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే నగరంలోని 6, 7, 48వ డివిజన్‌లలో కూడా పర్యటించారు.

నారాయణకు ఘన సన్మానం

నెల్లూరు(వైద్యం) : మాజీ మంత్రి, టీడీపీ సిటీ ఇన్‌చార్జి పొంగూరు నారాయణను నగరంలోని రాంజీనగర్‌లో బాలయ్య సైన్యం జిల్లా అధ్యక్షుడు ఎద్దల రవి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు తాళ్లపాక అనురాధ, ముప్పాళ్ల విజేత, మామిడాల మధు, పెనబర్తి సాయిరాం, మురళీమోహన్, కేవీ రెడ్డి, శ్రీనివాసులనాయుడు, రాజా రవి, ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతో పారిపోయిన అనిల్

నెల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో ఓటమి భయంతోనే ఎమ్మెల్యే అనిల్‌కుమార్ నరసరావుపేటకు పారిపోయారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విమర్శించారు. 15వ డివిజన్‌లో సోమవారం అంచూరు శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ నిన్నటి వరకు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ మీసాలు తిప్పిన అనిల్, నేడు తోకముడిచారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో అంచూరు జానకి, పొత్తూరు శైలజ, మాధవ నాయుడు, నలిశెట్టి శ్రీనివాసులు, నరేంద్ర, దశరథరామయ్య పాల్గొన్నారు.

కాపునాడు జిల్లా కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 5 : నెల్లూరు పార్లమెంటరీ విభాగం కాపు నాడు నూతన కార్యవర్గం సోమవారం జర్నలిస్టు భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా అధ్యక్షుడు సంపతి హనుమంతరావు మాట్లాడుతూ కాపునాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు నెల్లూరు పార్లమెంటరీ విభాగం కార్యవర్గం ఏర్పాటు చేశామన్నారు. నూతన కార్యవర్గంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉమ్మడిశెట్టి కొండలరావు, యువ కాపునాడు అధ్యక్షుడుగా పసుపులేటి సందీప్, నెల్లూరు రూరల్ అధ్యక్షుడుగా అళహరి విజయకుమార్, నెల్లూరు సిటీ అధ్యక్షుడుగా ఆకుల హనుమంతరావు, సిటీ ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి మల్లికార్జున్‌రావు, జిల్లా మహిళా అధ్యక్షురాలుగా బీవీ.లక్ష్మీ, నెల్లూరు సిటీ మహిళా అధ్యక్షురాలిగా గంగోడి సుశీలమ్మ, సిటీ మహిళా కార్యదర్శిగా బొమ్మిశెట్టి రాజమ్మ నియమితులయ్యారని తెలిపారు.

వివేకానంద వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుబ్బరాజు



నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 5 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడామైదానంలో సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన వివేకానంద వాకర్స్ అసోసియేషన్ తొలి అధ్యక్షుడిగా డీవీ.సుబ్బరాజు, కార్యదర్శిగా స్వర్ణ రమేష్, కోశాధికారిగా కె.జయదేవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సుబ్బరాజు మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు నిత్యం స్టేడియంకు వచ్చే వాకర్స్‌తో పాటు గతంలో వాకర్స్ సంఘాల్లో పనిచేసిన సీనియర్ నేతలంతా కలిసి నూతన సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ అసోసియేషన్‌కు అండగా ఉండి ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సంఘాల మాజీ గవర్నర్ అంకిరెడ్డి, సీనియర్ అడ్వయిజర్స్ మేకల నరేంద్రరెడ్డి, చింతల అమరేంద్ర రెడ్డి, రామవేంద్రషెట్టి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 5: భార్యపై అలిగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న భర్త మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. హరనాథపురం రెండోవీధిలో నివాసం ఉంటున్న జానీబాషా(59)కు ఇద్దరు భార్యలు. పెద్ద భార్య షాదాదికి ఏడుగురు సంతానం కాగా చిన్న భార్యకు కుమార్తె ఉంది. ప్రస్తుతం ఆయన రెండో భార్య వెంకటమ్మతో ఉంటూ అదే ప్రాంతంలోని ఓ ప్రముఖ విద్యాసంస్థల యజమాని ఇంటి నైట్ వాచ్‌మన్‌గా పని చేస్తున్నారు. జానీబాషా మద్యానికి బానిసై గతంలో పక్షవాతానికి గురై కొంతకాలం తర్వాత కోలుకున్నారు. అప్పటి నుంచి భార్య వెంకటమ్మ మద్యం తాగొద్దని భర్తకు చెబుతున్నా అతను వినలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 2వ తేది మద్యం విషయమై దంపతులు నడుమ గొడవలు జరిగాయి. దీంతో మనస్థాపానికి గురైన జానీబాషా మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను కటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడు కుమారుడు గౌస్‌బాషా ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ శ్రీహరిరెడ్డి కేసు నమోదు చేశారు.

రెండు నెలల్లో ప్రజా ప్రభుత్వం రాబోతుంది !

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : మరో రెండు నెలల్లో ప్రజాప్రభుత్వం రాబోతుందని, అప్పుడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అవుతాయని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు తెలిపారు. 6వ డివిజన్‌లో జనం కోసం జనసేన, బాబు ష్యూరిటీ-భవిషత్తు గ్యారెంటీ కార్యక్రమాలను జనసేన, టీడీపీ నేతలు కలిసి సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమయంలో టీడీపీ నాయకులు కొండా ప్రవీణ్ శంకర్, మల్లిక, హరి ప్రసాద్, జనసేన నాయకులు అజయ్‌బాబు, జీవన్, అలహరి తదితరులు పాల్గొన్నారు.


స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం : కమిషనర్



నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 5 : స్పందనలో వచ్చే అర్జీలకు సత్వరం పరిష్కారం చూపాలని ఎన్ఎంసీ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆయన నగర వాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా యంత్రాంగంతో మాట్లాడుతూ స్పందనలో స్వీకరించిన అర్జీలపై అధికారులు క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కసారితో సమస్య పరిష్కారం అయిపోవాలని స్పష్టం చేశారు. అనంతరం వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ కమిషనర్ చెన్నుడు నగరంలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన కార్యక్రమాలలో క్షేత్రస్థాయి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా 34వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో మేయర్ పోట్లూరి స్రవంతి పర్యటించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆరోగ్య అధికారులకు సూచించారు. ఆమె వెంట కార్పొరేటర్ ఫమీద్ ఉన్నారు.

తిరుపతి మన రాజధాని

చింత తగ్గని నినాదం



అమరావతా.. విశాఖా? ఏదీ తేలకుండానే ఐదేళ్ల గడిచిపోయాయి. జగన్‌రెడ్డి పుణ్యమా అని రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ దేశంలో ఎగతాళికి గురవుతోంది. మూడు రాజధానుల పాచిక ఈ ఎన్నికల్లో పారదని తెలిశాక జగన్‌రెడ్డి నోట కూడా ఆ మాట వినిపించడం లేదు. అయితే మాజీ ఎంపీ చింతా మోహన్ మాత్రం 'తిరుపతి మన రాజధాని' అంటూ బ్యానర్ పట్టుకుని ఊరూరా తిరుగుతున్నారు. 2021 ఉప ఎన్నికల సమయంలో ఆయన నోట వినిపించిన ఈ నినాదం ఇప్పుడు మళ్లీ ప్రచారాంశంగా మారింది. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్న ఆయన, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనీ, అప్పుడు తిరుపతిని రాజధానిగా చేస్తామని ధాటీగా చెబుతున్నారు. మద్రాసు నుంచి ఆంధ్ర విభజన జరిగిన సమయంలో ఆచార్య ఎన్‌జీ రంగా తిరుపతిని రాజధాని నగరంగా చేయాలని అడిగారని, అయితే నీలం సంజీవరెడ్డి మాటలు విని జవహర్‌లాల్ నెహ్రూ కర్నూలును రాజధాని చేశారని ఆయన చరిత్రను కూడా ప్రజలకు వివరిస్తున్నారు. రాష్ట్ర విభజన సమయంలో తిరుపతిని రాజధాని చేయాలంటూ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఎంపీ హోదాలో తాను రాసిన లేఖనూ, దానికి మన్మోహన్ సానుకూల స్పందననూ కూడా ఆయన సాక్ష్యంగా చూపిస్తున్నారు. ఆలూ లేదు చూలూ లేదు.. నడిమధ్యలో తిరుపతి కతేందబ్బా! అని కొందరు అనుకుంటున్నా.. చింతామోహన్ మాత్రం రాజధాని నినాదాన్ని మరింత బలంగా వినిపిస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సత్యవేడుతో ఆటాడుకుంటున్నారా?



వైసీపీ తీరుపై ఎస్సీల్లో రగులుతున్న అసంతృప్తి

వైసీపీకి సత్యవేడు నియోజకవర్గం ఆటస్థలంగా మారిపోయిందనే వ్యాఖ్యలు ఆ పార్టీలోనే వినిపిస్తున్నాయి. ఇప్పటికే రెండుసార్లు అభ్యర్థుల పేర్లు మారాయి. ఆదిమూలం గ్రాఫ్ బాగాలేదని తిరుపతి ఎంపీ గురుమూర్తిని తెచ్చిపెట్టారు. అసంతృప్తిని అణచుకుని ఆయన మండలాల్లో తిరిగి నాయకులను కూడేసుకున్నారు. ఆదిమూలం పార్టీ తీరుపై నిరసన వ్యక్తం చేయగానే, తిరుపతి ఎంపీ సీటు కూడా ఆయనకు తూచ్ అనేశారు. గురుమూర్తిని మళ్లీ తిరుపతి స్థానానికే అని ప్రకటించిన పార్టీ పెద్దలు, స్థానిక నేతలు ఎవ్వరితోనూ సంప్రదించకుండానే సత్యవేడుకి నూకతోటి రాజేష్ పేరును ప్రకటించారు. వైసీపీ కేడర్‌లో ఇది మరింత చికాకును పెంచింది. స్థానికంగా ఎవరూ లేరా? జీడీ నెల్లూరు నుంచి తెచ్చి మా నెత్తిన పెట్టాలా? అని రుసరుసలాడుతున్నారు. సోషల్ మీడియాలో ఈ అసంతృప్త పోస్టులు కుప్పలుతెప్పలుగా కనిపిస్తూ ఉన్నాయి. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, రిటైర్డ్ ఉద్యోగులు, వలంటీర్లు కూడా స్థానికేతరులకి టికెట్ ఎందుకు అనే ప్రశ్న సంధిస్తున్నారు. టికెట్ దొరికిందనే సంబరంలో ఉన్న నూకతోటి రాజేష్‌కి దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. అభ్యర్థి అని ప్రకటించినా ఆయన ఇంతదాకా నియోజకవర్గంలో అడుగు పెట్టనేలేదు. మర్యాదపూర్వకంగా కూడా స్థానిక నేతలను కలుసుకోనే లేదు. ఇటువంటి వాతావరణంలో కోట్లు ఖర్చుపెట్టి పోటీచేసేందుకు ఆయన జంకుతున్నారనే ప్రచారం జరుగుతోంది. పరిస్థితి చూసి అధిష్ఠానం మరో కొత్త వ్యక్తి పేరును సత్యవేడు నుంచి ప్రకటిస్తారని కూడా చెప్పుకుంటున్నారు. ఏమైనా... దళిత నియోజకవర్గాలతోనే వైసీపీ ఈ ఆటలన్నీ ఆడుతోందనే ఆగ్రహం ఎస్సీల్లో చాపకింద నిప్పులా రగులుతోంది.

- సత్యవేడు

పంచాయతీ కార్యాలయంలో వైసీపీ సమావేశాలా?

నారాయణవనం, ఫిబ్రవరి 5: సత్యవేడు వైసీపీ ఎమ్మెల్యే ఆదిమూలం వ్యవహారం తర్వాత నియోజకవర్గంలో ఆశావహులు పెరిగిపోయారు. టికెట్ కోసం పెద్ద ఎత్తున పావులు కదుపుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఇటువంటి నేతల్లో కొందరు సోమవారం ఉదయం నారాయణవనం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో పార్టీ సమావేశాలు నిర్వహించడంపై విమర్శలొస్తున్నాయి. పంచాయతీ కార్యాలయంలో పార్టీ సమావేశాలు నిర్వహించడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



పంచాయతీ కార్యాలయంలో సమావేశమైన వైసీపీ నాయకులు

'రా.. కదలిరా' సభకు సర్వం సిద్ధం

- లక్ష నుంచి లక్షన్నర మంది హాజరవుతారని అంచనా
- నేడు జీడీనెల్లూరుకు రానున్న చంద్రబాబు నాయుడు



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న నాయకులు

చిత్తూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలోని జీడీనెల్లూరు సమీపం రామానాయుడుపల్లెలో మంగళవారం మధ్యాహ్నం జరిగే 'రా.. కదలిరా' బహిరంగ సభకు సర్వం సిద్ధం చేశారు. సభా వేదిక, హెలిప్యాడ్‌ను సిద్ధం చేయగా, ప్రాంగణం ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొనే ఈ సభకు సంబంధించి జిల్లా టీడీపీ నాయకులు వారం రోజులుగా ఇక్కడ ఏర్పాట్లను దగ్గరుండి పూర్తిచేశారు. సోమవారం నుంచే నాయకులు, కార్యకర్తల సందడితో సభాప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. మాజీ మంత్రి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్లమెంటు అధ్యక్షుడు పులివర్తి నాని, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి థామస్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబు నాయుడు తదితరులు సోమవారం సభాప్రాంగణాన్ని, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఏ నియోజకవర్గం నుంచి ఎంతమంది, ఎవరి ఆధ్వర్యంలో సభకు హాజరవ్వాలనే ప్రణాళికను ఆయా ఇన్‌చార్జులు పూర్తి చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలనుంచి లక్షన్నర మంది హాజరయ్యేలా ప్లాన్ చేసుకున్నారు. కనీసం లక్ష మందికి తగ్గకుండా వస్తారని భావిస్తున్నారు. జీడీనెల్లూరు నియోజకవర్గం నుంచి 40 వేల మంది, పూతలపట్టు, చిత్తూరునుంచి 20వేల చొప్పున, పలమనేరు, చంద్రగిరి, నగరి నుంచి 10 వేల చొప్పున, కుప్పం నుంచి 5 వేల మంది హాజరవుతారని నాయకుల అంచనా. లక్షన్నర మందికి అవసరమైన ఏర్పాట్లను సభా ప్రాంగణం వద్ద సిద్ధం చేశారు. ఇక్కడికి ఆయా నియోజకవర్గాల నుంచి హాజరయ్యేవారికి వారి మండల నాయకులు భోజనాలను ప్యాకింగ్ చేసి వాహనాల్లో అందించేలా చూసుకున్నారు. గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాల వారీగా నాయకులకు శ్రేణుల్ని తరలించే బాధ్యతను అప్పగించారు.



సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు

చిత్తూరు నుంచి 4 వేల స్కూటర్లతో ర్యాలీ

చిత్తూరు నియోజకవర్గం నుంచి 4 వేల స్కూటర్లతో జీడీనెల్లూరు వరకు టీడీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించనున్నారు. అలాగే 80 బస్సులు, 150 ప్యాసింజర్ ఆటోలు, 80 సుమోలను సిద్ధం చేసుకున్నారు. ఈ మేరకు చిత్తూరు నగరం, గుడిపాల, చిత్తూరు మండలాల్లో స్థానిక నాయకులకు తరలింపు బాధ్యతల్ని అప్పగించారు. చిత్తూరు నియోజకవర్గ శ్రేణులకు నగర శివారు ధాబా వద్ద భోజనాలను ఏర్పాటు చేశారు.

సభను విజయవంతం చేయండి

చిత్తూరు సిటీ: రా.. కదలిరా బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు చంద్రప్రకాష్, కఠారి హేమలత, గురజాల జగన్మోహన్, సీఆర్ రాజన్, కాజూరు బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ దిశగా రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, డివిజన్, వార్డు స్థాయి నాయకులందరూ కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు.

ఒంటి గంట నుంచే నేతల ప్రసంగాలు!

వెదురుకుప్పం: టీడీపీ చేపట్టిన 'రా.. కదలిరా' బహిరంగ సభలో మంగళవారం మధ్యాహ్నం నుంచే జిల్లా నేతల ప్రసంగాలు మొదలయ్యే అవకాశాలున్నాయి. ఈ సభలో పాల్గొనేందుకు చంద్రబాబు నాయుడు మధ్యాహ్నం 3 గంటలకు వేదిక వద్దకు చేరుకుంటారు. 4.30 గంటల వరకు జరిగే సభలో పాల్గొని తిరుగు ప్రయాణమవుతారు. ఈ క్రమంలో చంద్రబాబు వచ్చేలోగానే హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రముఖ నాయకులు ప్రసంగిస్తారు.

చెరువులో మునిగి ముగ్గురు చిన్నారుల మృతి



చిన్నారుల మృతికి కారణమైన పచ్చిపాల ఓబన్న చెరువు



పునీత్, కన్నయ్య, తేజేశ్వర్ మృతదేహాలు

పాకాల, ఫిబ్రవరి 5: ప్రమాదవశాత్తూ చెరువులో మునిగి ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాకాల మండలం దామలచెరువు పంచాయతీ ఊటువంక గ్రామానికి చెందిన రామకృష్ణ, విజయలక్ష్మి దంపతుల కుమారులు పునీత్ (11), కన్నయ్య (9).. శేఖర్, జ్యోతి దంపతుల కుమారుడు తేజేశ్వర్ (9) గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్నారు. సోమవారం సాయంత్రం పాఠశాల ముగిశాక ఇంటికి వచ్చారు. స్కూల్ బ్యాగులు ఇళ్ల వద్ద పెట్టేసి, గ్రామ సమీపంలోని పచ్చిపాల ఓబన్న చెరువు వద్దకెళ్లి ఆడుకుంటున్నారు. ప్రమాదవశాత్తూ తేజేశ్వర్ చెరువులో పడిపోయాడు. పునీత్, కన్నయ్యలు గమనించి తేజేశ్వర్‌ని రక్షించడానికి ప్రయత్నించి, వీరూ నీటిలో మునిగిపోయారు. గ్రామస్తులకు తెలిసి వారొచ్చి వెలికి తీసేలోపే ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. కూలీ పనులకు వెళ్లి తిరిగొచ్చిన తల్లిదండ్రులకు విషయం తెలియడంతో వారు గుండెలు పగిలేలా రోదించారు. ఈ దుర్ఘటనతో గ్రామంలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. పాకాల సీఐ రాజగోపాల్ ప్రమాదస్థలాన్ని సందర్శించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'నవ' స్పందన

- కూర్చోబెట్టి అర్జీల స్వీకరణ



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 5: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో అత్యధికంగా భూ సమస్యలపై 153మంది ఫిర్యాదు చేశారు. మొత్తంగా వివిధ శాఖలకు సంబంధించి 201 అర్జీలు అందాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అర్జీలు స్వీకరించారు. కాగా.. కొత్త కలెక్టర్ లక్ష్మీశ, స్పందనలో కొన్ని మార్పులు చేశారు. అధికారుల ముందు గుంపులు లేకుండా, అందరినీ కుర్చీల్లో కూర్చొనేలా ఏర్పాటు చేశారు. టోకెన్‌లు కేటాయించి, ప్రతి ఒక్కరి సమస్యనూ సావధానంగా విన్నారు. అర్జీలు రాయడం రానివారి కోసం ముఖద్వారం దగ్గరే కొంతమందిని నియమించి, అర్జీ రాయించే ఏర్పాటు చేశారు.

ప్రభుత్వం ఇచ్చిన స్థలంపై వైసీపీ నేతల దౌర్జన్యం



రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామనగర్‌లో ప్లాట్ నెంబరు2675ను అప్పటి ప్రభుత్వం మాకు కేటాయించింది. ఆ స్థలంలో ఇల్లు కూడా కట్టుకున్నాం. అయితే ఇటీవల అదే ప్లాట్‌ను రేణిగుంట తహసీల్దారు తమకు కేటాయించారంటూ వైసీపీ వారు మా ఇంటి వద్దకు వచ్చి దౌర్జన్యం చేస్తున్నారు.

- మంగమ్మ, కరకంబాడి

విశ్వకర్మలకు అవమానం



18 రకాల చేతివృత్తుల వారికి చేయూతనివ్వడానికీ, వారి ఆత్మగౌరవం పెంచేందుకూ ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన ప్రవేశపెడితే, రాష్ట్ర ప్రభుత్వం ఆ పథకాన్ని నీరుగారుస్తోంది. దాన్ని సక్రమంగా అమలు చేయాలి. సచివాలయాల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారు.

- కలెక్టరేట్ వద్ద నిరసనలో బీజేపీ నేతలు

మోసం జగన్!



జిల్లాలో సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికులకు జీతాలు సరిగా అందడంలేదు. చనిపోయిన వారికి పీఎఫ్ డబ్బులు ఖాతాలో జమ కావడంలేదు. ఈ ప్రభుత్వం దగా చేస్తోంది. ఐదేళ్లుగా జగన్‌రెడ్డి ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇస్తోంది. ఇప్పటికైనా మా సమస్యలు పరిష్కరించండి.

- కలెక్టరేట్ వద్ద ఆందోళనలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్మికసంఘం నేతలు అయ్యప్ప, సురేష్, చెంచయ్య, పాండు

ధాన్యం ధరలు తగ్గుముఖం

- ఆవేదనలో రైతన్న



ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌కు ఎత్తుతున్న కూలీలు

పెళ్లకూరు, ఫిబ్రవరి 5: రబీ సీజన్‌లో సాగుచేసిన వరి పంటల కోతలు ప్రారంభమయ్యాయి. వారం కిందట బీపీటీ 5204 రకం 75 కిలోల బస్తా రూ.2100 ధర పలికింది. ప్రస్తుతం రూ.1900కి పడిపోయింది. అలాగే ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకం రూ.2300 నుంచి రూ.2100కి, కేఎన్‌ఎం 1638 రకం రూ.2150 నుంచి రూ.2000కి, ఎన్‌ఎల్‌ఆర్ 34449 రకం రూ.1,650 నుంచి రూ.1400కి, ఎంటీయూ 1010 రకం 75 కిలోల బస్తా రూ.1650 నుంచి రూ.1400కు తగ్గిపోయింది. మరోవైపు దిగుబడులు కూడా ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు ఈప్రాంత రైతులు మన రాష్ట్రంలో ధరలు తగ్గాయనుకుంటే తమిళనాడు, కర్ణాటకలకు ఎగుమతులు చేసి లాభాలు గడించేవారు. ప్రస్తుతం దేశమంతా ఒకే పన్ను కిందకు రావడంతో మిల్లర్లంతా జాతీయ స్థాయిలో సిండికేట్‌గా మారుతున్నారు. దీనివల్ల ఎక్కడికి పోయినా ప్రయోజనం ఉండటం లేదని రైతులు చెబుతున్నారు.

కొనుగోలు కేంద్రాలెక్కడ?

ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఇవి లేకపోవడంతో దళారుల దోపిడీకి గురవుతున్నామని చెబుతున్నారు.

ఆగని గ్రావెల్, ఇసుక తవ్వకాలు



శిరసనంబేడులో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన గోతులు

పెళ్లకూరు, ఫిబ్రవరి 5: పెళ్లకూరు మండలంలో గ్రావెల్, ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రభుత్వ భూములు, స్వర్ణముఖినది నుంచి గ్రావెల్, ఇసుకను తోడేస్తున్నారు. మండలంలో పుల్లూరు నుంచి తాళ్వాయిపాడు వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర స్వర్ణముఖినది ప్రవహిస్తుంది. అదే విధంగా రోసనూరు, శిరసనంబేడు, బంగారంపేట, సీఎస్‌పేట తదితర గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ లభిస్తుంది. నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారి విస్తరణ పనుల పేరిట రాత్రి, పగలు తేడా లేకుండా వందలాది వాహనాల ద్వారా గ్రావెల్, ఇసుక ఇతర అవసరాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా బహిరంగ రహస్యమే అయినప్పటికీ అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్యనేత భాగస్వామ్యం కావడంతో అధికారులు మౌనం వహిస్తున్నారు. వివిధ ప్రభుత్వ భవనాలతో పాటు పక్కా గృహాల నిర్మాణాలకు స్వర్ణముఖినది నుంచి ఇసుక, నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం గ్రావెల్ తరలించేందుకు అధికారులు అనుమతులు ఇస్తున్నారు. దీన్ని అడ్డం పెట్టుకొని అక్రమార్కులు తవ్వకాలు జరుపుతున్నారు. యడకూడి, పుల్లూరు, కలవకూరు, ముమ్మారెడ్డిగుంట, పెన్నేపల్లి, తాళ్వాయిపాడు తదితర ప్రాంతాల నుంచి ఇసుకను తరలిస్తుండటంతో భూగర్భజలాలు అడుగంటి తాగు, సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా నందిమాల, చెన్నప్పనాయుడుపేట, బంగారంపేట, శిరసనంబేడు, రోసనూరు తదితర ప్రాంతాల నుంచి గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఉన్నతాధికారులుస్పందించి గ్రావెల్, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ గెలుపు తథ్యం: కురుగొండ్ల



కురుగొండ్లను సత్కరిస్తున్న నాయకులు

వెంకటగిరి, ఫిబ్రవరి 5: రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు తథ్యమని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి గ్రామశక్తి పోలేర్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి దశ దిశ తీసుకొచ్చే శక్తి చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. పాలనా సమర్థత కలిగిన చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్ర ప్రజలు నిర్ణయించుకున్నారని స్పష్టం చేశారు. వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కురుగొండ్ల రామకృష్ణ పేరును ఖరారు చేసినట్లు ఆంధ్రజ్యోతి దినపత్రికలో వార్త రావడంతో నాయకులు, కార్యకర్తలు కురుగొండ్లను సత్కరించి ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరామదాసు గంగాధర్, కాపా శ్రీనివాసులు నాయుడు, కొప్పారపు చంగారావు, మల్లారం బాబు, నాగరాజు, శ్రీహరి, ప్రహలాదా తదితరులు పాల్గొన్నారు.

డక్కిలిలో టీడీపీ నేతల సంబరాలు

డక్కిలి, ఫిబ్రవరి 5: వెంకటగిరి అసెంబ్లీ టికెట్ మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు కేటాయించడంతో డక్కిలి మండల టీడీపీ నేతలు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. రామకృష్ణ సొంతూరు కమ్మవారిపల్లిలో గ్రామస్తులు టపాసులు పేల్చి, మిటాయిలు పంచిపెట్టారు. వెంకటగిరిలోని కురుగొండ్ల నివాసానికి చేరుకొని ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, మాజీ ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి, ఆస్పత్రి సలహా కమిటీ చైర్మన్ చెలికం బాస్కరరెడ్డి, నాయకులు పీవీ చౌదిరి, పోకూరు రమేష్, పాయసం గోపాల్, పొట్టా మునెయ్య, సుర్తాని కొండయ్య, మీరయ్య, శివప్రసాద్, పెంచలరెడ్డి, పిల్లి శ్రీనివాసులు రెడ్డి, మచ్చల వేణు, అయ్యపరెడ్డి తదితరులు కురుగొండ్లను కలిసి అభినందనలు తెలిపారు.

కురుగొండ్ల విజయం ఖాయం

డక్కిలి, ఫిబ్రవరి 5: వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ విజయం కాయమని డక్కిలి మండల టీడీపీ అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కురుగొండ్ల రామకృష్ణ పేరును పార్టీ అధిష్ఠానం ఖరారు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కురుగొండ్లను ప్రజలు నిండుమనసుతో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.


స్వర్ణముఖి బ్యారేజీకి నీటిని విడుదల చేయండి

గూడూరు, ఫిబ్రవరి 5: స్వర్ణముఖి బ్యారేజీకి వెంటనే ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సోమవారం కోరారు. బ్యారేజీలో నీటి నిల్వలు తగ్గిపోవడంతో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ప్రజలు తాగు, సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్యారేజీ ద్వారా 15వేల ఎకరాల్లో వరిసాగు చేస్తుతన్నారని, తెలుగుగంగ కాలువ నుంచి ఒక టీఎంసీ నీటిని విడుదల చేస్తే ఈ మండలాల ప్రజలకు సాగుకు, తాగునీటికి ఇబ్బందులు ఉండవన్నారు. అధికారులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నీటిని విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలని సునీల్‌కుమార్ కోరారు.

భూ ఆక్రమణను అడ్డుకోండి

ఓజిలి, ఫిబ్రవరి 5: ఓజిలి మండలం పెద్దపరియ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను ఓ ప్రైవేటు పరిశ్రమ ఆక్రమించుకుని ప్రహరీ నిర్మాణం చేపడుతోందని గ్రామస్తులతో పాటు సీపీఎం నాయకులు సోమవారం డిప్యూటీ తహసీల్దారు మధుసూదనరాజుకు ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలోని సర్వేనెంబరు 24లో 12 ఎకరాలు, 25లో 10 ఎకరాల భూమి ఉందన్నారు. అందులో కొంత భూమికి పెద్దపరియ గ్రామానికి చెందిన పలువురు ఎస్సీలకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందన్నారు. ఇంకా దాదాపు 15 ఎకరాలకు పైగా మిగిలిన ఉన్న భూమిని ప్రైవేటు పరిశ్రమ యజమాన్యం ఆక్రమించిందన్నారు. రెవిన్యూ అధికారులు విచారించి ప్రహరీ నిర్మాణ పనులను అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చాపల వెంకటేశ్వర్లు, బి.గోపాలయ్యతో పాటు గ్రామస్తులు పారిచర్ల సుబ్బరాయులు, సీహెచ్ పెంచలయ్య, రామయ్య, దయాకర్, సుష్మిత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం ఖాయం: చింతా



ర్యాలీలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

కోట, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో 135 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగించడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ జోస్యం చెప్పారు. మండల పరిధిలోని సిద్ధవరం, ఉత్తమనెల్లూరు, కొక్కుపాడు, వంజివాక గ్రామాల్లో సోమవారం డోర్ టూ డోర్ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ఇంటింటా తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ ప్రస్తుత అధికార వైసీపీ పట్ల రాష్ట్ర ప్రజలు విసిగి పోయారని, టీడీపీని నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రజల్లో మార్పు వచ్చిందని, కాంగ్రెస్‌ను కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తేజోవతి, సుధా, పంటా శ్రీనివాసులురెడ్డి, నాగరాజు, దయాకర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

వాకాడు, ఫిబ్రవరి 5: వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చింతామోహన్ పిలుపునిచ్చారు. మండలంలోని జాంగ్రపేట, కాశీపురం, కొండాపురం గ్రామాల్లో ఇంటింటికి మన కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తేజోవతి, సుధా, నాగరాజు, దయాకర్, శ్రీరామ్ పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి కృషి

గూడూరు, ఫిబ్రవరి 5: దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కళాశాల కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన మారంరెడ్డి శివకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం డీఆర్‌డబ్ల్యూ కళాశాల యాజమాన్య కమిటీ నూతన సభ్యులను ఎంపిక జరిగింది. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ మెహర్‌మణి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ఉన్న అల్లారెడ్డి రవికుమార్‌రెడ్డి ఇటీవల మృతిచెందడంతో నూతన అధ్యక్షుడుగా మారంరెడ్డి శివకుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడుగా డాక్టర్ జనార్దనరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కోశాధికారి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



శివకుమార్‌రెడ్డిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

నాడు ప్రథమం...
నేడు అధమం

- నష్టాలబాటలో సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో
- కొత్త బస్సులు రాకపోగా.. ఉన్నవీ రద్దు
- పల్లె వెలుగు సర్వీసులకే పరిమితం



సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అత్యంత ప్రాధాన్య కలిగిన సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న ఈ డిపోను 1999 ఏప్రిల్ 16న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. మూడేళ్ల వరుసగా మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. 2007, 2009లోనూ కోటి రూపాయల ఆదాయంతో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాంటిది ప్రస్తుతం మూడు కోట్ల మేరకు నష్టాల్లో నడుస్తూ 120వ ర్యాంక్‌తో రాష్ట్రంలో చివరి స్థానంలో ఉంది. ఒకప్పుడు సూళ్లూరుపేట డిపో నుంచి బెంగళూరు, హైదరాబాదు, కడప, మదనపల్లె, ద్రాక్షరామం, తిరుమల, కావలి ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడిచేవి. రాబడి కూడా బాగా వచ్చేది. గతంలో 49 సర్వీసులు ఉన్న డిపోలో నేడు 25 మాత్రమే ఉన్నాయి. ఇవి కాకుండా అద్దె బస్సులు ఏడు నడుస్తున్నాయి. మిగిలిన సర్వీసులను ఇతర డిపోలకు తరలించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వచ్చి సర్వీసులు అడిగినా బస్సులు పంపే స్థితిలో అధికారులేరంటే డిపో పరిస్థితి ఏమిటో ఇట్టే తెలుస్తోంది. సూళ్లూరుపేట నుంచి జిల్లా కేంద్రమైన తిరుపతికి ఒకప్పుడు అరగంటకు ఒక బస్సు ఉండేది. ప్రస్తుతం 5 బస్సులు మాత్రమే తిరుపతి మార్గంలో తిరుగుతున్నాయి. అదే విధంగా సూళ్లూరుపేట - కోట మార్గంలో ప్రతి గంటకు ఒక బస్సు తిప్పేవారు. ఆ మార్గంలోనూ ఇదే పరిస్థితి. ఉన్న అరకొర సర్వీసులను అధికారులు ఏదో ఒక కారణంతో తరచూ రద్దు చేస్తున్నారు. ఇక సూళ్లూరుపేట నుంచి తడ మీదుగా నడిచే బస్సులను పూర్తిగా రద్దుచేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించుకొన్న పట్టించుకోలేదు. ప్రస్తుతం ఆయా మార్గాల్లో తమిళనాడు బస్సులు తిరుగుతున్నాయి. షార్ ఉద్యోగుల కోసం సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట - బెంగళూరు మధ్య రెండు సర్వీసులు నడిపేవారు. అలాగే తిరుమలకు సర్వీసులు ఉండేవి. ప్రస్తుతం ఒక బస్సు కూడా తిప్పడం లేదు. బెంగళూరు, హైదరాబాద్, తిరుమలకు బస్సులు నడపాలని ప్రజలు, ఇస్రో ఉద్యోగులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అయితే కర్ణాటక ఆర్టీసీ మాత్రం శ్రీహరికోటకు బస్సు నడుపుతుండడం గమనార్హం. ఒకప్పుడు లాభాల్లో నడుస్తూ బహుమతులు అందుకున్న డిపో నేడు నష్టాల బట పట్టడానికి పాలకులతో పాటు అధికారులు కూడా కారణమని చెప్పాలి. ఆదాయ మార్గాల్లో అదనపు సర్వీసులు నడపకపోగా ఉన్నవీ రద్దు చేయడం, ప్రయాణికులు కోరినా బస్సులను తిప్పడంలేదు. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డిపో పరిస్థితి మరింత దిగజారిపోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైన డిపో అధికారులు స్పందించి దూర ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులతో పాటు ప్రయాణికుల రద్దీ ఉన్న మార్గాల్లో బస్సులు నడిపితే నష్టాలనుంచి గట్టెక్కించవచ్చు.

టీడీపీ గెలుపునకు కష్టపడి పనిచేయండి: పాశిం



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 5: రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబునాయుడిని సీఎంగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. టీడీపీ అధిష్ఠానం గూడూరు అసెంబ్లీ అభ్యర్థిగా పాశిం సునీల్ కుమార్‌ను ప్రకటించడంతో స్థానిక టవర్‌క్లాక్ సెంటర్, పార్టీ కార్యాలయం వద్ద బాణాసంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. వైసీపీ అరాచక పాలన వల్ల అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దోచుకోవడమే పనిగా వైసీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. నష్టాల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించకలిగే సత్తా ఒక్క చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. సీఎం జగన్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. రానున్న ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పనిచేసి టీడీపీని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, ఇశ్రాయిల్‌కుమార్, వెంకటేష్, సునీల్, జనార్దనరెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి



రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఆర్టీవో ఆదినారాయణ

గూడూరు, ఫిబ్రవరి 5: రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో ఆపదలో ఉన్న క్షతగాత్రులను ఆదుకునేందుకు ముందుకు వచ్చి సమీప ఆస్పత్రుల్లో చేర్పించాలని ఆర్టీవో ఆదినారాయణ అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారికి మొదటి గంట సమయం ఎంతో ముఖ్యమైందన్నారు. క్షతగాత్రులను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందిస్తే వారి ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. ప్రమాదాన్ని చూసిన వారు క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు సాయం అందించాలన్నారు. అటువంటి వారికి కేంద్ర ప్రభుత్వం రూ.5వేలు నగదు ప్రోత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు. వాహనదారులు నిబంధనలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ సునీల్, పట్టణ సీఐ పాపారావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ షకీనా, సిబ్బంది పాల్గొన్నారు.

కర్రసాము పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



కర్రసాములో ప్రతిభ చూపిన క్రీడాకారులు

నాయుడుపేట, ఫిబ్రవరి 5: నెల్లూరులో జరిగిన సౌత్ ఇండియా కర్రసాము ఛాంపియన్ షిప్ 2024 పోటీల్లో నాయుడుపేట మండలానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపారు. ఇందులో నాయుడుపేట మండలం నుంచి 13 మంది క్రీడాకారులు పాల్గొనగా, ఏ.మహిత, ఈ.మనోజ్, కే.భవాని ప్రసాద్, జి.చక్రధర్, శ్రీవిద్య, ప్రసన్నకుమార్ ప్రథమ బహుమతులు కైవసం చేసుకున్నారని కర్రసామ అసోసియేషన్ ఏపీ కోశాధికారి పవన్‌కుమార్ తెలిపారు. క్రీడాకారులను కర్రసాము ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, అధ్యక్షుడు శ్రీహరి అభినందించారు. ఈ కార్యక్రమంలో కర్రసాము అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి, మేనేజర్ వినోద్, సభ్యులు మనోహర్, ఆస్రఫ్, సతీష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ ఆదాయం పెంపునకు కృషి

తడ, ఫిబ్రవరి 5: ఏఎంసీకి ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం పులివేంద్ర వద్ద ఉన్న ఏఎంసీ కార్యాలయంలో ఛైర్మన్ పర్వతరెడ్డి కవిత అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరవారిసత్రం మండలంలో గోదాములు, ఫ్లాట్‌ఫామ్ నిర్మాణాల కోసం 3.5 ఎకరాల భూమి సేకరించామని, త్వరలోనే వాటి నిర్మాణం మొదలుపెడతామని తెలిపారు. సమావేశంలో ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, తడ, సూళ్లూరుపేట ఎంపీపీలు కొలవి రఘురెడ్డి, అల్లూరు అనిల్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ నాగరాజారెడ్డి, కార్యదర్శి రావమ్మ, వైసీపీ నాయకులు పర్వతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మునీష్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వేతన బకాయిలు ఇవ్వండి

నాయుడుపేట, ఫిబ్రవరి 5: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులతో కలిసి మున్సిపాలిటీ కమిషనర్‌కు జనార్దనరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతి చెందిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మధు, అచ్చెమ్మ, మహాలక్ష్మి, గోపాలయ్య పాల్గొన్నారు.

తహసీల్దారుకు సన్మానం

బాలాయపల్లి, ఫిబ్రవరి 5: తహసీల్దార్ శ్రీనివాసులును రెవెన్యూ సిబ్బంది సన్మానించారు. ఈయన తిరుపతి కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. దీంతో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ శిరీష, వీఆర్వోలు ఆదిశేషయ్య, జయశంకర్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాసులు రెడ్డి, మేకలయ్య, శ్రీనివాసులు, ఈశ్వరరాజు, రాజేంద్ర, పెంచలయ్య, సిబ్బంది రియాజ్, గురవయ్య తదితరులు తహసీల్దార్‌ను సన్మానించారు. కాగా, గుంటూరు జిల్లాకు చెందిన పుల్లారావు బాలాయపల్లి తహసీల్దార్‌గా నియమితులయ్యారు.

టీడీపీ నేత హౌస్ అరెస్టు



పెళ్లకూరు, ఫిబ్రవరి 5: మండలంలోని జీలపాటూరు గ్రామానికి చెందిన స్థానిక సర్పంచు, నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్‌ను సోమవారం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. మంగళవారం విజయవాడలో నిర్వహించే ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తున్న ఆయను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

తాగునీటి పథకానికి భూమిపూజ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5: మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో టిడ్కో గృహాలకు కాళంగి నది నుంచి మంచి నీరందించేందుకు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సోమవారం ఉదయం భూమిపూజ చేశారు. సాయంత్రం పట్టణంలో ఎంకేఎం కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ జరిగింది. కార్యక్రమాలకు ఎమ్మెల్యే అసమ్మతి వర్గానికి చెందిన మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, వైసీపీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్ రెడ్డితో పాటు పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు డుమ్మా కొట్టారు.

బాలాయపల్లి ఎంపీడీవోగా అరుణ



బాలాయపల్లి,ఫిబ్రవరి 5: బాలాయపల్లి ఎంపీడీవోగా ఎ.అరుణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రమీలారాణి బదిలీపై కందుకూరుకు వెళ్లగా చిత్తూరు జిల్లా నింద్ర మండలంలో పనిచేస్తున్న అరుణ బాలాయపల్లికి వచ్చారు.


డక్కిలి తహసీల్దార్‌గా శ్రీనివాసులు



రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

డక్కిలి, ఫిబ్రవరి 5: డక్కిలి తహసీల్దార్‌గా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గుంటూరు జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ రమేష్ బాబు తిరుపతి కలెక్టరెట్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం శ్రీనివాసులు స్థానిక సచివాలయానికి వెళ్లి జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ప్రజలను తిప్పుకోకుండా సకాలంలో పనులు చేసి పెట్టాలని సిబ్బందికి సూచించారు.

కోట తహసీల్దారుగా నాగరాజరావు



కోట, ఫిబ్రవరి 5: కోట తహసీల్దారుగా నాగరాజరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా వేమూరు మండల తహసీల్దారుగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. కోట తహసీల్దారుగా పనిచేస్తున్న పద్మావతిని ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు.

23న ఎన్‌బీకేఆర్‌లో ఇన్స్పిరాన్

కోట, ఫిబ్రవరి 5: మండల పరిధిలోని విద్యానగర్‌లో గల ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 23వ తేదీన ఇన్స్పిరాన్-2024 సాంకేతిక సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు సురేష్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమేష్, పార్థసారధి పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

గూడూరు, ఫిబ్రవరి 5: పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్, వంశీ, శివశంకర్, మహేష్, రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని గెలిపించండి

గూడూరు, ఫిబ్రవరి 5: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి పరిమల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాల విధానాల వల్ల నిత్యవసర ధరలు పెరిగిపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం పేదలను విస్మరించి కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సాల్మాన్ రాజు, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట కాంగ్రెస్ టికెట్‌కు దరఖాస్తు



పీసీసీ కార్యాలయంలో దరఖాస్తు ఇస్తున్న మధుసూధనరావు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5: సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం దూర్జటి మధుసూదనరావు దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో చాలా కాలంగా కొనసాగుతున్న ఆయన 2014లో సూళ్లూరుపేట నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. సూళ్లూరుపేట అసెంబ్లీ, తిరుపతి పార్లమెంటు స్థానాలకు సోమవారం విజయవాడలోని పీసీసీ కార్యాలయంలో దరఖాస్తు అందజేశారు.

పాలన తీసికట్టు.. ప్రచారానికి బోర్డు పెట్టు

ఆర్టీసీ బస్టాండులో అధికార పార్టీ ఫ్లెక్సీ



ఆర్టీసీ బస్టాండులో హోర్డింగ్ పై సిద్ధం ఫ్లెక్సీ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5: అధికార వైసీపీ నాయకుల ప్రచారానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు, ప్రభుత్వ స్థలాలు ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలను ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారు. సూళ్లూరుపేటలోని బస్టాండులో ఆర్టీసీకి చెందిన హోర్డింగ్‌లపై ముఖ్యమంత్రి జగన్ చిత్రంతో ఉన్న ప్రచార ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. డిపో, బస్టాండు అభివృద్ధిని పట్టించుకోని నేతలు సిద్ధం అంటూ ఫ్లెక్సీని ఆర్భాటంగా ఏర్పాటు చేయడంపై విపక్షాలతో పాటు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సిమెంటు రోడ్లకు మరమ్మతులు చేయండి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 5: పట్టణంలో ధ్వంసమైన సిమెంటు రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపాలిటీ కమిషనర్ జనార్దనరెడ్డిని సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్యాస్ పైపు లైన్ల పేరిట పట్టణంలో సిమెంటు రోడ్లను ధ్వంసం చేస్తున్నారని, కానీ వాటికి మరమ్మతులు సకాలంలో చేయడం లేదన్నారు. తవ్వకాల్లో తాగునీటి పైపులు కూడా దెబ్బతిన్నాయని, వాటిని తక్షణమే మరమ్మతులు చేయాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజశేఖర రెడ్డి, సురేంద్రబాబు, సుందరరావు తదితరులు ఉన్నారు.

చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థినిలకు దుస్తులు అందజేస్తున్న పీఆర్‌శాఖ ఈఈ గిరినాథ్

గూడూరు, ఫిబ్రవరి 5: చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పంచాయతీరాజ్‌శాఖ ఈఈ గిరినాథ్ అన్నారు. సోమవారం గిరినాథ్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక నరసింగరావుపేటలోని బాల సదన్‌లో విద్యార్థినిలకు పౌష్టికాహారం, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినిలు చిన్నతనం నుంచే లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించేందుకు కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో రియాజ్‌ఆహ్మద్, రవిచంద్ర, మురళీరెడ్డి, శివయ్య, వీరేంద్రనాథ్, ఎంవీ.రమణయ్య, శీనయ్య, ఇలియాజ్, రూపేష్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రజనీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

గూడూరు, ఫిబ్రవరి 5: పట్టణంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు సీఐటీయూ నాయకులు సోమవారం వినతిపత్రం అందచేశారు. మున్సిపల్ పాఠశాలల్లో స్వీపర్లుగా పనిచేస్తున్న కార్మికులకు గత 16 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వారికి వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిదంగా పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో మౌళిక వసతులను మెరుగుపరచాలని కోరారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ రమణయ్య, శంకరయ్య, ప్రసాద్, సురేష్, మణి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములు కేటాయించండి

డక్కిలి, ఫిబ్రవరి 5: కులవృత్తులపై ఆధారపడి జీవినం సాగిస్తున్న తమకు సాగుచేసుకోనేందుకు భూములు కేటాయించాలని డక్కిలి మండలం మోపూరు రోడ్డు ప్రాంతంలో నివాసం వుంటున్న సంచార జాతులకు చెందిన 40 కుటుంబాలు సోమవారం తిరుపతి కలెక్టరు కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ ఆగ్గల మునెయ్య ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోపూరు సర్వే నెంబరు 1లో వందలాది ఎకరాలు ప్రభుత్వ భూములు వున్నా తమకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో మేత పోరం భూములకు పట్టాలు ఇచ్చేందుకు అధికారులు అన్ని గ్రామాల నుంచి ప్రతిపాదనలు పంపించారని, అయితే తమకు మాత్రం అన్యాయం చేస్తున్నారని వాపోయారు. కులవృత్తులకు తగిన ఆదరణ లేకపోవడం జీవనం కష్టమైపోంతోందని చెప్పారు. అనంతరం కలెక్టరును కలిసి వినతిపత్రం అందజేశారు.

గూడలిలో భవిష్యత్తుకు గ్యారెంటీ

కోట, ఫిబ్రవరి 5: మండల పరిధిలోని గూడలిలో సోమవారం రాత్రి బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పల్లెమల్లు వెంకటకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ పల్లెమల్లు లక్ష్మమ్మ ఆధ్వర్యంలో గూడలి, ప్రకశంకాలనీల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.